విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 01 సెప్టెంబర్ 2025 8 పేజీలు

కాలనీలా... కారడవులా..!

> కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎంఏవై (ప్రధానమంత్రి ఆవాస్ యోజన) పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కార్యక్రమం కార్యాచరణలో విఫలం. గృహ నిర్మాణాలు ఒక అడుగు ముందుకు... పది అడుగులు వెనక్కు ...అన్న చందంగా సాగుతున్నాయి.

విశాలాంధ్ర - ఏలూరు: సమాజంలో పేదలందరికీ అన్ని సదుపాయాలతో ఇళ్ళు నిర్మించి ఇస్తామన్న పాలకుల ప్రకటనలు నీటిమీద రాతలు అయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎంఏవై (ప్రధానమంత్రి ఆవాస్ యోజన) పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కార్యక్రమం కార్యాచరణలో ఘోరంగా విఫలమైంది. స్థలాలు పొందిన లబ్ధిదారులు కొందరు అప్పులు చేసి మరి ఇళ్ళు మొదలుపెట్టారు. గత పాలకులు ఏ ఒక్క వసతి కల్పించకపోవడంతో ఇళ్ళ నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పుడు కాలనీ చుట్టూ అడవిలా మారిపోయింది. అసలు కాలనీలోకి కాలు పెట్టే అవకాశం లేకుండా పోయింది. దీంతో పేదలందరికీ సొంత ఇంటి కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. ఐదేళ్ల క్రితం జిల్లా కేంద్రమైన ఏలూరు శివారు పోణంగి గ్రామంలో 250 ఎకరాల్లో అతిపెద్ద లే అవుట్‌ను రూపొందించారు. 2019-2020లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఫేజ్ -1 కింద ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.1 లక్షా 80 వేలు మంజూరు చేశారు. ఇళ్ళ నిర్మాణాన్ని ప్రారంభించారు. అప్పటినుంచి ఇళ్ల నిర్మాణం నత్త నడక నడుస్తోంది. ఈ గ్రామంలో 11,050 ఇళ్ళు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ కాలనీలో 4-5 ఇళ్ళు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. కొన్నింటికి స్లాబులు పూర్తయ్యాయి. కొన్ని స్లాబ్ వరకు పూర్తి చేసి సిమెంట్ గడపలు, కిటికీలు అమర్చి

▶మిగతా 2లో..

శాంతియుతంగా గణేష్ నిమజ్జనం : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: కులమతాలకు అతీతంగా శాంతి, స్నేహపూర్వక వాతావరణంలో పర్వదినాలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో శాంతి కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాకు ప్రశాంతమైన జిల్లాగా పేరు ఉందని, ఇకముందు ఇదే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. పండుగ పర్వదినాలను కుల, మతాలకు అతీతంగా స్నేహభావంతో అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని కోరారు. ప్రస్తుతం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రశాంత వాతావరణంలో నిమర్జనాలను పూర్తి చేసి గణపతి ఆశీస్సులు పొందాలన్నారు. నిమజ్జనం సమయంలో ఎవర్ని ఇబ్బంది పెట్టని విధంగా, గొడవలకుతావు లేకుండా

▶మిగతా 2లో..

నిలకడగా గోదావరి

- జలదిగ్బంధంలోనే ముంపు గ్రామాలు
- ఆందోళనలోనే బాధితులు

విశాలాంధ్ర - వేలేరుపాడు : గత మూడు రోజులుగా క్రమంగా పెరిగిన గోదావరి వరద శనివారం నిలకడగా ఉంది. భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకొని రెండో ప్రమాద హెచ్చరికతో కొనసాగిన గోదావరి వరద ఆ తర్వాత నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. దీంతో మండలంలో వరద పెరగకుండా తగ్గకుండా నిలకడగా ఉంది. గడిచిన నాలుగు రోజులుగా మండలంలోని ఎద్దువాగు, పెద్దవాగు పోటెత్తి ఉన్నాయి. ఎద్దువాగు పోటెత్తడం వలన ఎడవల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారి ముంపుకు గురైంది. దీంతో కోయిదా, కట్కూరు పంచాయ తీలలోని సుమారు 15 గ్రామాలు జలదిగ్బం ధంలో ఉన్న విషయం విధితమే. ఆయా గ్రామాలకు అవసరమైన మంచినీరు, నిత్యవసర సరుకులు తదితర సామాగ్రిని అధికారులు పడవల ద్వారా వాగు దాటిస్తూ ఆయా గ్రామాలకు సరుకు రవాణా చేస్తున్నారు. పూర్తి రహదారి సౌకర్యంలేని గ్రామాలకు లాంచీల

▶మిగతా 2లో..

జిల్లా కేంద్రంగా నరసాపురం ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే — 4లో

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు — 8లో

పల్లె వెలుగేదీ...!

> ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం ఆర్టీ బస్సుల్లో కల్పిస్తుంటే.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరు గ్రామ మహిళలు దీనికి నోచుకోలేదు. దీంతో మహిళలు మా గ్రామనికి బస్సులు నడుస్తాయా? ఉచిత బస్సు ప్రయాణం చేస్తామా? రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారూ మహాప్రభో అంటూ.. వాపోతున్నారు.

- ప్రైవేటు బస్సులు రయ్..రయ్.. ఆర్టీసీ నైయ్..నైయ్...
- అన్ని గ్రామాలకు సౌకర్యాలు.. మా గ్రామంపైనే వివక్ష..
- స్త్రీశక్తి పథకం మాకు అందని ద్రాక్షేనా
- మా ఊరుకు బస్సులు, రోడ్డు అంటూ మహిళల ఆవేదన

విశాలాంధ్ర బ్యూరో - తూర్పుగోదావరి : స్త్రీ శక్తి పథకం పేరిట రాష్ట్రమంతా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ఆర్టీసీ బస్సులలో కల్పించింది. ఈ బస్సులలో ఆధార్ కార్డు చూపిస్తూ రాష్ట్రమంతా మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ఇదంతా బాగానే ఉంది కానీ అసలు మా ఊరుకు బస్సు రాదు.. మేము ఏం చేయాలి.. మాకు ఈ పథకం అందని ద్రాక్షేనా అంటూ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరు గ్రామ మహిళలు వాపోతున్నారు. మా ఊరుకు సరైన రోడ్‌లేదని ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు. గుంతలు, వానొస్తే చెరువును తలపిస్తున్నా.. ప్రైవేటు స్కూళ్ల బస్సులు ఆ గ్రామానికి వస్తూనే ఉన్నాయి. కాపవరం నుంచి తిరుమల స్కూల్ బస్సు, నిడదవోలు నుంచి శశి స్కూల్ బస్సులు రెండు, గోపవరం పీపుల్ ట్రీ బస్సులు రెండు, మార్కొండపాడు జయంతి స్కూల్ బస్సు, నిడదవోలు ఎస్ ఆర్ కె స్కూల్ బస్సు, తణుకు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ బస్సు , సమిశ్రగూడెం విజ్ఞాన్ వికాస్ బస్సులు రెండు, ముప్పవరం యూనివర్సల్ బస్సు, మార్కొండ పాడు భారతి స్కూల్ బస్సు , ఇలా 12 స్కూల్ బస్సులకు పైగా వస్తున్నాయి. మరి ఆ బస్సులు వస్తుండగా ప్రభుత్వ బస్సులు ఎందుకు రావడం లేదు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డులో బస్సులు నడిపితే బస్సులు చెడిపోతాయని ఆలోచనతో ఆర్టీసీ

▶మిగతా 2లో..

కారడవులా..! (1వ పేజీ తరువాయి)

వున్నాయి. చాలావరకు ఇళ్లు పునాది దశలోనే ఆగిపోయాయి. రోడ్లు ,తాగునీరు, డ్రైన్లు, విద్యుత్ సరఫరా లాంటి మౌలిక సౌకర్యాలు లేవు. అసం పూర్తిగా ఉన్న ఈ నిర్మాణాల్లో తుమ్మ చెట్లు, పిచ్చి చెట్లు పెరిగిపోయి జగనన్న కాలనీలు కీకారణ్యాన్ని తలపిస్తున్నాయి. గృహ నిర్మాణాలు అంతంత మాత్రంగా పూర్తయ్యాయి. ప్రస్తుతం పోణంగి లోని జగనన్న కాలనీలో ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిల యంగా మారి పోయాయి. పగలు తేడా లేకుండా ఇక్కడ ఆ సాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగి పోతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉచి తంగా ఇల్లు నిర్మించి ఇస్తామని పాలకులు అరచేతిలో వైకుంఠం చూపించి మధ్యలోనే వదిలేశారని లబ్ధిదా రులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం సగంలో మిగిలిపోయిన ఈ ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

గణేష్ నిమజ్జనం (1వ పేజీ తరువాయి)

పూర్తి చేయాలన్నారు. వినాయకుల పందిళ్లలో, నిమజ్జనాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో డీజే సౌండ్ సిస్టం అనుమతి లేదని స్పష్టం చేశారు. ఊరేగింపు సమయంలో హాస్పిటల్స్, మసీదులు వద్ద చాలా తక్కువ సౌండ్ తో మాత్రమే ఊరేగింపులు కొనసాగాలన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మరియు పీస్ కమిటీ వైస్ చైర్మన్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ పండగ పరవ దినాలను ప్రశాంత వాతావరణ నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేయడం జరిగింద న్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వినాయక మహోత్సవాలు ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో ఇప్పటికే రెండు దఫాలుగా సమావేశాలను నిర్వహిం చడం జరిగిందన్నారు. ఎలక్ట్రిసిటీ, ఫైర్, పోలీస్, రెవిన్యూ, పంచాయితీరాజ్ తదితర శాఖలకు తగు ఆదేశాలను జారీచేయడం జరిగింది అన్నారు. అందరూ సమన్వయంతో నిమజ్జనలను పూర్తి చేయాలన్నారు. అదనపు ఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పర్వదినాలను నిర్వహిం చుకునేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిం దన్నారు. వినాయక చవితి ప్రారంభమై నాలుగు రోజులు పూర్తయిందని, నేడు సుమారు 500 విగ్రహా లకు నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్టీవోలు మరియు కమిటీ మెంబర్లు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, డీఎస్పీ లు జై సూర్య, శ్రీ వేద, డి.విశ్వనాథ్, డి పి ఆర్ ఓ కమిటీ కన్వీనర్ టి.నాగేశ్వరరావు, కమిటీ మెంబర్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి ప్రసాద్ రెడ్డి, డిఎంహెచ్వో డాక్టర్ జి.గీతాబాయి, భీమవరం మున్సిపాలిటీ సహాయ కమిషనర్ రాంబాబు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ మతాల పెద్దలు, ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాలకు భద్రతా చర్యలు : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఏలూరులో జరగబోయే వినాయక నిమజ్జనాలకు గట్టి భద్రత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఏలూరులో వినాయక చవితి వేడుకల అనంతరం, వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం కోసం ఏలూరులోని తూర్పు లాకులు, పడమర లాకులు, దెందులూరు సమీపములో వినాయక నిమజ్జనం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతాలను ఆదివారం ఎస్పీ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు కొన్ని కీలకమైన జాగ్రత్తలు, సూచనలు చేశారు. ప్రజలు వినాయక నిమజ్జనం సమయాలలో తప్పక జాగ్రత్త చర్యలు పాటించాల్సిన సూచించారు. డీజేలు, అశ్లీల నృత్యాలకు విగ్రహాల ఊరేగింపులో అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు ఇతరులకు అసౌకర్యం కలిగిస్తాయని, అందువల్ల సంప్రదాయ సంగీతాన్ని, భక్తి పాటలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నియమాలు పాటిస్తూ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన నిర్దేశిత ప్రాంతాలలో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. వినాయక నిమజ్జనాల్లో ఎటువంటి ప్రమా దాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ పోలీసులకు సహకరించి, శాంతియుతంగా, ఆనందంగా నిమజ్జనం కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలని ఎస్పీ కిషోర్ సూచించారు. ఈ పరిశీలనలో ఎస్పీతో పాటు ఎస్బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఏలూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, మహిళా ఎస్ఐ నాగమణి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివి :కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: వసుధ ఫౌండేషన్ మానవతా సేవలు వెలకట్ట లేనివని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో వసుధ వాత్సల్య కేంద్రం వద్ద వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 21 సేవా సంస్థలకు రూ.28 లక్షలను చెక్కుల రూపంలో అందించారు. అంతేకా కుండా 11 మంది రోగులకు రూ.2.50 లక్షల నగదు అందిం చారు. చదువులో ప్రతిభ కనబరిచిన 30 మంది పేద విద్యార్థులకు రూ.2.10 లక్షలు ఉపకార వేతనంగా అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి సేవలు పొందుతున్న విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదువుకునే వారికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. చైర్మన్ మం తెన వెంకట రామరాజు మాట్లాడుతూ కష్టపడి చదువుకునే వారికి మా ఫౌండేషన్ సహకారం అందించడానికి ముందు ఉంటుందన్నారు. కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు వీడేనా...?

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: టిడిపి కొయ్యలగూడెం పట్టణంలో అధ్యక్ష పదవి వర్గ పోరులో కొట్టుమిట్టాడుతుంది. 2024 వరకు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన జేష్ట రామకృష్ణారావు గత అసెంబ్లీ ఎన్నికలలో జనసేన విజయంలో జ్యేష్ట రామకృష్ణారావు ప్రధానోపాత్ర పోషించారు. జనసేన విజయం సాధించడంలో కొయ్యలగూడెం పట్టణం మెజారిటీ తోనే సాధ్యమైందని అనడంలో సందేహం లేదు. అయితే అధికారం చేపట్టిన తర్వాత టిడిపి పట్టణ అధ్యక్ష పదవి కోసం కొందరు అధిష్టానం వద్ద పావులు తెలిపారు.జేష్ట రామ కృష్ణారావు మాత్రం పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తూ తనదైన శైలిలో అహర్నిశలు కష్టపడుతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు.ఈ నేపథ్యంలో ఇటీవల కొంతమంది వ్యక్తులు రామకృష్ణారావుకు వ్యతిరేకంగా టిడిపి సీనియర్ నాయకుల సూచనలు సైతం ధిక్కరిస్తూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహించడం చర్చనీయాంశం అయింది. అయితే ప్రజా ప్రతినిధులు మాత్రం అధిష్టానం ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయితేనే ఆ వ్యక్తి అధ్యక్ష స్థానంలో పనిచేయాలని తెలుపుతున్నట్లు సమా చారం. అయితే తొలి నుండి జయపజయాలతో నిమిత్తం లేకుండా పార్టీ కోసం, కేసులను సైతం ఎదుర్కొంటూ జెండా మోస్తూ పార్టీ పటిష్టతకు చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని అధిష్టానాన్ని స్థానిక నాయకులు కోరుతున్నారు.టిడిపి కొయ్యలగూడెం పట్టణ అధ్యక్ష పదవిని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల, సమక్షంలో అధిష్టానం ఆదేశాల మేరకు ఏకాభిప్రాయంగా ఎన్నుకున్న వారికే ప్రాధాన్యత కల్పించాలని టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు సూచిస్తూ పార్టీ కోసం ఎవరు పని చేశారో అధిష్టానం వద్ద పూర్తి సమాచారం ఉందని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను పార్టీ సీరియస్ గా తీసుకుంటుందని ఈ విషయంలో అధిష్టానానిధి తుది నిర్ణయం అని తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోని కొయ్యలగూడెం పట్టణంలో పార్టీలో వర్గ విభేదాలు ఏర్పడతాయా లేక అందరూ కలిసి పని చేస్తారా అనేది వేచి చూడాల్సిందే.

డివికె విద్యాసంస్థలు వినాయక మండపం అందజేత

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని భూదేవిపేట గ్రామంలో గణపతి నవరాత్రులు నిర్వహించే మండపాన్ని డి వి కే విద్యాసంస్థలు ఆదివారం కమిటీకి అందించారు. స్థానికుడైన డీవీకే విద్యాసంస్థల చైర్మన్ దాసరి వెంకటకృష్ణ భూదేవిపేటలో నిర్వహించే వినాయక నవరాత్రి మహో త్సవంలో భాగంగా భార్య యశోధరదేవితో పూజారి నందీశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి పండగ చేయటానికి శాశ్వతంగా ఉండాలని ఉద్దేశంతో ఇనప కడ్డీలతో చేసిన ప్రత్యేక మండపాన్ని ఆలయ కమిటీకి బహూకరించారు. ప్రతి ఏడాది కట్టెలతో మండపాన్ని కట్టడం ఆ తర్వాత వాటిని జాగ్రత్త పరచడం ఇబ్బంది కరంగా ఉన్న తరుణంలో శాశ్వత మండపాన్ని అందించటం చాలా సంతోషించదగ్గ విషయమని వెంకటకృష్ణ దంపతులకు ఆలయ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అనేకచోట్ల డివికే విద్యాసంస్థలు కొనసాగడంతో పాటు స్థానికంగా సిద్ధార్థ కాలేజ్ నిర్వహిస్తున్న విషయం విధితమే.

నిలకడగా గోదావరి

(1వ పేజీ తరువాయి)

ద్వారా గోదావరిపై ప్రయాణించి నిత్య వసరాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు మండ లంలో గ్రామాలు ముంపుకు గురికానప్పటికీ జలదిగ్బం ధంలో చిక్కుకొని బాహ్య ప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు లేకుండా పోయాయి.

తగ్గని ఆందోళన : గోదావరి వరద నిలకడగా ఉన్నప్పటికీ ముంపు గ్రామ ప్రజల్లో ఆందోళన తగ్గలేదు. వర్షాకాలం మొదలైనప్పటినుండి ఇప్పటికే పలుమార్లు గోదావరి వచ్చి తగ్గింది. మళ్లీ ఇప్పుడు గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక వరకు వచ్చి నిలకడగా ఉన్నప్పటికీ వరద వలన ఎప్పుడు ఏ నష్టం కలుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజు కూలిపై ఆధారపడి జీవిస్తున్న వందల కుటుంబాలు ముంపు ప్రాంతాల్లో ఉండటం వలన వారు పడుతున్న వేదన వర్ణనాతీతం. ముంపు గ్రామాల్లో పిల్లలతో, వృద్ధులతో ఎన్నిసార్లు ఇబ్బందులు పడుతున్న తప్పని పరిస్థితుల్లో ఆ గ్రామాల్లోనే జీవితాలను వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం సహాయం కోసం ఎంతో ఎదురుచూస్తున్నారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.12 (1744533) / 2019/ డి.బి. తేది : 28-08-2025

భీమవరం పురపాలక సంఘం పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్టు టెండరు నోటీసు నెం. 12(1-6)/BHI/General/NPS/2025-26/E1/E2 & టెండరు నోటీసు నెం. 12(7-16)/BHI/General/2025-26/E1** లోని జనరల్ నిధుల నుండి **15** పనులకుగాను **రూ. 78.38 లక్షలతో & ఎన్‌పిఎస్ నిధుల నుండి 1 పనికిగాను రూ. 3.08 లక్షలతో ఇ- ప్రోక్యూర్మెంట్ ద్వారా టెండర్లు జి.ఓ.ఎమ్.ఎస్ నెం: 94** లేక దానిపై ఇతర అనుబంధ జి.వో.ల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇప్రోక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా **(సెల్: 9849906540, 9849906543)** వారిని సంప్రదించగలరు.

కమిషనరు,
భీమవరం పురపాలక సంఘం

పల్లె వెలుగేదీ...! (1వ పేజీ తరువాయి)

బస్సులను ఎప్పటి నుండో నిలిపివేసింది. మరి ప్రైవేటు యాజమాన్యాలు నడిపే బస్సులకు ఆ దుస్థితి ఏర్పడదా? అవి ఎందుకు తిరుగుతున్నాయి అని ప్రశ్నిస్తున్నారు. అసలు మండలంలో 16 గ్రామాలు ఉండగా బస్సు లేని గ్రామం ఒక్క మద్దూరు గ్రామం మాత్రమే . మా ఊరుకు రోడ్డు లేకపోవడం వల్లే కదా బస్సు లేదు.. బస్సు రాకపోవడం వల్లే కదా మాకు స్త్రీ శక్తి పథకం అమడ దూరంలో గోదారి గట్టు అంత దూరంలో ఉంది. ఆ గోదారి గట్టు చేరుకోవాలంటే ఈ గుంతల రోడ్డు గుండా మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి ఉంది. రాజమండ్రి నుంచి నిడదవోలు తాడేపల్లి గూడెం తణుకు బస్సులు పదుల సంఖ్యలో గోదారి గట్టు పైన నుండి వెళ్ళిపోతూ ఉంటాయి గోదారి గట్టుకు చేరుకుంటే కానీ బస్సు ఎక్కే భాగ్యం లేదు. కేవలం ప్రభుత్వాలకు మా గ్రామం పైన వివక్ష ఎందుకో అర్థం కావడం లేదు అంటున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా మా రాతలు మారడం లేదు. ఊరికి రోడ్డు సౌకర్యం లేదు, బస్సు సౌకర్యం లేదు, మరి ఎందుకు మా గ్రామం కొవ్వూరు మండలంలో ఉంది. కేవలం మా ఓట్ల కోసమేనా ? మా గ్రామంలో మాకు సౌకర్యాలు కల్పించవలసిన అవసరం లేదా? అని మద్దూరు గ్రామ మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామంలో రైస్ మిల్లులకు ధాన్యం వస్తుంది, తిరిగి ఐకెపిలకు ధాన్యం వెళుతూనే ఉంది. అలాగే కోళ్ల ఫారాలకు మేతలు వస్తున్నాయి తిరిగి గుడ్లు, కోళ్లు ఎగుమతి అవుతున్నాయి. అన్ని రకాలుగా రవాణా వ్యవస్థలు నడుస్తుండగా, ప్రభుత్వ బస్సులు ఒక్క రోడ్డు లేని కారణంగానే రాకపోవటం బాధాకరమని, అందువల్ల ముఖ్యంగా రోడ్డు లేని మా గ్రామానికి రోడ్డు వేసి మా పిల్లలు పడుతున్న ఇబ్బందులను, మేము అనుభవిస్తున్న మనోవేదనలను అర్థం చేసుకొని తద్వారా మా గ్రామానికి బస్సు సౌకర్యం, రోడ్డు సౌకర్యం కల్పిస్తారని, ఒకసారి మా గ్రామానికి వచ్చి పరిశీలిస్తారని, మద్దూరు గ్రామ మహిళలు కోరుకుంటున్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జనం

విశాలాంధ్ర- లింగపాలెం: లింగపాలెం మండలంలోని అనేక గ్రామాలలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. యడవల్లి, కల రాయనగూడెం, ములగలంపాడు, ధర్మాజీగూడెం, భోగోలు పంచాయతీ లోని వెంకటాపురం, రాయన్నపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ధర్మాజీగూడెం పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర -భీమడోలు: విద్యార్థి దశ నుంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా కృషి చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించటం ఖాయమని మానవతా కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్లు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాల బాలికలు పాల్గొని జీకే కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే తమ లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటిని సాధిం చేందుకు కష్టపడి ఇష్టపడి చదువుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లోని దినపత్రికలు, ఇతర పుస్తకా లను చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని వారు కోరారు. అనంతరం లైబ్రరీలో పుస్తక ప్రదర్శన నిర్వ హించడమైనది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ముప్పిరి శెట్టి సుబ్రహ్మణ్యం, పెద్దలు, స్టూడెంట్స్, పాల్గొన్నారు.

సాగర్ జలాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- ముసునూరు: నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా మెట్ట ప్రాంత రైతులకు సాగర్ జలాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని జలవనరుల శాఖ డిఈ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె ముసునూరులోని నేలపాటి వారి కుంట సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ వద్ద నీటి ప్రవాహ తీరును పరిశీలించారు. అనంతరం డి ఈ విజయలక్ష్మి స్థానిక నేతలు,రైతులతో కలసి సాగర్ లోని కృష్ణా జలాలకు హారతులు ఇస్తూ ఆనందంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేంపాడు మేజర్ డిసి చైర్మన్ రాపర్ల బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలోని పాడేరు రిజర్వాయర్ వద్ద గండిపడి మనకు రావాల్సిన నీటి సప్లై ఆగిపోవడంతో గత 20 రోజులుగా రాష్ట్ర గృహ నిర్మాణ మరియు పౌర సమాచార శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో సుమారు లక్ష యాభై వేల రూపాయలు ఆయనసొంత నిధులతో గండి పూడ్చించి తిరిగి యధావిధిగా నీరు ప్రవహించేలా కృషి చేసినట్లు తెలిపారు. తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు గద్దె రఘు మాట్లాడుతూ సాగర్ కాల్వ ఆయకట్టు చివరి రైతులకు నీళ్లు అందించే పూచి మాదని హామీ ఇచ్చారు. రైతులు ఈ నీటిని వృధా కాకుండా అన్ని గ్రామాలలోని చెరువులను నింపుకొని కాలువల ద్వారా పంటలకు మళ్ళించుకోవాలన్నారు. బలివే శ్రీ రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ బొమ్మ కంటి శ్యామలరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లి గంగారం, పొట్లూరి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామదాసు, ఏ ఈ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: విధుల పట్ల నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు నిరంతరం గుర్తింపు ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన సి.హెచ్.రవికుమార్‌ను కలెక్టరేట్ పి జిఆర్ఎస్ సమావేశమందిరంలో శనివారం రాత్రి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణరెడ్డి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 39 సంవత్సరములు ప్రభుత్వ సర్వీసులో సేవలందించడం గర్వకారణం అన్నారు. విధులు యందు అంకితభావంతో పనిచేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఉద్యోగంలో చేరిన ప్రతివారికి పదవీ విరమణ సర్వసాధారణమని కీలకమైన రెవెన్యూ శాఖలో టైపిస్టుగా జాయిన్ అయ్యి ఆర్ఐ, డి టి, తహసీల్దార్, పనిచేసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో

జిల్లా ల్యాండ్ సూపర్డెంట్‌గా పదవి విరమణ పొందిన సి హెచ్ రవికుమార్ ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఆర్డీఓలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెం కటేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, జిల్లాలోని పలువురు తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొని, రవికుమార్ దంపతులను దృశ్శాలువాలు పూలమాలలతో సన్మానించారు.

ఆర్యన్ ఉదయ్‌కు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: లండన్ రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ అరేటికి శ్రీ కృష్ణ దేవరాయ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. మెంటే పార్ధ సారధి అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, శాసన మండలి సభ్యులు బొర్రా గోపి మూర్తి తదితరులు విచ్చేసి ఆర్యన్ ఉదయ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణ దేవరాయ సాంస్కృతిక సమితి, ఛాంబర్ ఆఫ్ కామర్స్, సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఫర్ బెటర్ సొసైటీ, మైత్రి కాలనీస్ వెల్ఫేర్ సొసైటీ, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, శ్రీ కృష్ణ దేవరాయ పతంజలియోగ శిక్షణా కేంద్రం, ఆల్ వాకర్స్ అసోసియేషన్, సెయింట్ మేరీస్ హైస్కూల్, తుందుర్రు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర- ఏలూరు : జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన యువతకు ఉపాధి నిమిత్తం హెవీ మోటార్ వెహికల్ (హెచ్ఎంవి) డ్రైవర్ శిక్షణను ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ ద్వారా ఆసక్తి కలిగి అభ్యర్థులకు ఉచితంగా అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేరుగు ముక్కంటి చెప్పారు. ఇందుకోసం పశ్చిమ గోదావరి జిల్లా నుండి 5గురు పురుషులు, 5 గురు మహిళలు సహా మొత్తం 10 మంది అభ్యర్థులకు ఈ నెల 21 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరణ గడువు విధించినట్లు చెప్పారు. అయితే మహిళా అభ్యర్థుల నుండి ఎటువంటి దరఖాస్తులు అందలేదని వివరించారు. డ్రైవర్ శిక్షణ కోసం షెడ్యూల్ కులాల అభ్యర్థులకు శిక్షణ నిమిత్తం ఒక్కొక్క అభ్యర్థికి అయ్యే రూ.20 వేల రూపాయల ఖర్చును ఎస్సీ కార్పొరేషన్ భరిస్తుందని చెప్పారు. ఈ విధంగా 10 మంది అభ్యర్థులకు కలిపి శిక్షణ నిమిత్తం అయ్యే రూ.2 లక్షల ఖర్చును ఎస్సీ కార్పొరేషన్ నిధుల నుండి అభ్యర్థుల తరపున చెల్లిస్తుందని వివరించారు. అయితే మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు అందకపోవడంతో వారికి మరోసారి అవకాశం కల్పించడం కోసం కేవలం మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరొక వారం రోజులు పాటు గడువును పొడిగించినట్లు ఈడి ముక్కంటి స్పష్టం చేశారు. డ్రైవింగ్ శిక్షణ కోసం ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగానే మహిళ అభ్యర్థులకు సైతం డ్రైవింగ్ శిక్షణకు అయ్యే ఖర్చును ఎస్సీ కార్పొరేషన్ భరిస్తుందన్నారు. అందువల్ల ఎస్సీ కార్పొరేషన్ ఎండి ఆదేశాల మేరకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఈడి స్పష్టం చేశారు. కనీస వయస్సు 20 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాలని 40 ఏళ్లు దాటిన అభ్యర్థులు తప్పనిసరిగా మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని షెడ్యూల్ కులాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. ఇతర వివరాలకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ఫోన్ నెంబర్ 8019684966కు సంప్రదించాలని ఈడీ ముక్కంటి కోరారు.

వెరికోస్ వెయిన్స్ ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర -భీమవరం : కాళ్ళలోని సిరల్లో ఒత్తిడి పెరగడం వల్ల వెరికోస్ వెయిన్స్ వస్తాయని, వెరికోస్ వెయిన్స్ అనేవి చర్మం ద్వారా కనిపించే అసాధారణంగా విస్తరించిన సిరలని లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్మన్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, క్లబ్ అధ్యక్షులు బొండా రాంబాబు అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వెరికోస్ వేయిన్స్ (ఉబ్బిన సిరలు) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్ శారీరక ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయని, కాళ్ళ సిరల్లో ఒత్తిడి పెరగడం వల్ల ఒక వ్యక్తి బరువుగా, అలసిపోయి, నీరసించిపోయేలా చేస్తుందన్నారు. అవి నొప్పి లేదా ఇతర లక్షణాలను కలిగించవచ్చు లేదా కలిగించకపోవ చ్చునని, ఇటువంటి పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించాలని అన్నారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్ ఉంటె చికిత్స చేయకపోతే చర్మం విరిగి పుండుగా ఏర్పడుతుందని, ఇది సాధారణంగా నయం కావడానికి చాలా సమయం పడుతుందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్, ట్రెజరర్ కనకర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో వెరికోస్ వేయిన్స్ కాళ్లు వాపు, మంట, దురద, కాళ్లలో రంగు మారటం, నరాలు ఉబ్బటం, కాళ్లలో పుండ్లు ఏర్పడడం, బరువెక్కడం వంటి సమస్యల పై పరీక్షలు నిర్వహించారని, ఎలాంటి కోతలు, కుట్లు లేకుండా చికిత్స నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో పబిలిశెట్టి కనకరాజు, కోశాధికారి కనగర్ల విజయ రామకృష్ణ, విశ్వనాథరాజు, కోట్ల నాని, ఫణి రాజు,నందమూరి రాజేష్, సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజల ఆర్థిక భద్రత, సేవలలో ఎల్ఐసీ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : దేశ ప్రజల ఆర్థిక భద్రత, సేవలో 69 సంవత్సరాలుగా జీవిత బీమా సంస్థ ఉందని ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ అన్నారు. సెప్టెంబరు 1 బీమా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గడచిన 69 సంవత్సరాలుగా దేశ ప్రజలకు ఆర్థిక భద్రత, ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయలు చేయూత నిస్తూ ప్రభుత్వ రంగ అగ్రగామి ఆర్థిక సంస్థగా జీవిత భీమా సంస్థ అభివృద్ధి చెందిందన్నారు. 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని జాతి జనుల సేవలో అగ్ర భాగాన ఎల్. ఐ. సి నిలిచిందన్నారు. 1956 లో రూ 5 కోట్ల పెట్టుబడి తో ప్రారంభించిన ఎల్. ఐ. సి.ఈనాడు 54 లక్షలకోట్ల ఆస్తులతో ప్రపంచ స్థాయి బీమా సంస్థగా ఉందన్నారు. 40 కోట్ల పట్టాదారులకు కొంగు బంగారంగా సేవలందిస్తోందని బాపయ్యశర్మ తెలిపారు. బీమా ప్రీమి యంపై జిఎస్‌టిని తొలగించాలన్నారు. ఎల్ఐసిని మరింత పటిష్టంగా అభివృద్ధి చేసి, కాలాను గుణంగా ఉద్యోగుల భర్తీ, మౌలికసదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వం మరింతగా ప్రోత్సాహించాలన్నారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్న ఎల్ఐసి మరింతగా సేవలు అభివృద్ధి చేస్తుందని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కాంగ్రెస్ పార్టీకి గ్రామీణ ప్రాంతాలలో పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని జిల్లా కార్యదర్శి పొన్న రామచంద్ర రావు పేర్కొన్నారు. మండలంలో బోడిగూడెం గ్రామ పంచాయతీ పరిధి అంకాల గూడెం గ్రామంలో కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన పొన్న రామచంద్రరావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మద్దుకూరి బుచ్చిరాజు, కునపోము రాజారత్నం లు మాట్లాడుతూ పూర్వం కాంగ్రెస్ పార్టీ భారతదేశాన్ని పరిపాలించినప్పుడు ఎటువంటి మత రాజకీయాలు, కుల రాజకీయాలు లేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండేవారని అన్నారు. పేద ప్రజలను ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన ఉత్సాహవంతమైన యువకులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలి శ్రీను, తమిర్చి వెంకటేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సమాజానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కృషి

విశాలాంధ్ర మండవల్లి: మెరుగైన సమాజం కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తుందని కెరీర్ గైడెన్స్ చైర్మన్ సూధాబత్తుల విజయ్ కుమార్ అన్నారు. మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మానవతా మండల అధ్యక్షుడు గుడివాడ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గణేష్ మాట్లాడుతూ మానవతా ద్వారా వేల మందికి ఆర్థిక సహాయంతో పాటు నెలవారి సరుకులు, మార్చురీ ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన బొప్పన నాగమల్లేశ్వరరావు వాళ్లకు నిత్యవసర సరుకులు మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షులు బొల్లంపల్లి కృష్ణారావు, కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు,పరిసే కిన్నె బాబు, వరద శ్యామ్ గణేష్, బుద్దుల రాముడు గన్నవరం వార్డ్ మెంబర్ ముచ్చర్ల కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

నూరుద్దీన్ నియామకంపై హర్షం

విశాలాంధ్ర - గణపవరం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలెప్మెంట్ అథారటీ డైరెక్టరుగా ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామానికి చెందిన మహ్మద్ నూరుద్దీన్(మాజిద్) నియమించి నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆదివారం తెలిపారు. ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ డైరెక్టర్గా నియమించినందుకు నూరుద్దీన్ కూటమి ప్రభుత్వానికి గన్ని వీరాంజనేయులుకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నూరుద్దీన్కు ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ డైరెక్టర్ పదవి ఇవ్వడం పట్ల నిడమర్రు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు ముత్యాల స్వామి, టిడిపి ప.గో జిల్లా యవజన కార్యదర్శి మహమ్మద్ గఫర్ ఖాన్, సారికి లెనిన్ బాబు, తానుకొండ సూరన్న (మైనర్), ఎండి జాకీర్ ,మహమ్మద్ ఖాదరి, తాడి శ్రీనవాసరావు, పేపిటి శ్యామసుందరం, కరీం ఖాన్, విజయ్ కుమార్, మల్లేశ్వరరావు, ఏసుబాబు, హర్షం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో లెక్చరర్స్‌ను నియమించండి

విశాలాంధ్ర -ఏలూరు : నగరంలోని రామకోటి సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గల ప్లస్-2 ఇంటర్ విద్యార్థులకు జువాలజీ లెక్చరర్ ను, పెదవేగిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్-2లో కామర్స్ లెక్చరర్ ను నియమించాలని కోరుతూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకి వినతిపత్రం అందించినట్లు రాష్ట్ర కోశాధికారి ఏ.భాను చెప్పారు. రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ పాఠశాలల్లో విద్యార్థులకు జువాలజీ సబ్జెక్టుకు, కామర్స్ సబ్జెక్టుకు అధ్యాపకులు లేకపోవడం వల్ల ఈ సబ్జెక్టులకు తరగతులు జరగక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో జువాలజీ లెక్చరర్ ను నియమిం చాలని, అలాగే రామ కోటి సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ లో సీఈసీ, హెచ్ఈసి గ్రూపులను ప్రవేశపెట్టి, అందుకు అవసరమైన తరగతి గదులను కేటాయించాలని భాను డిమాండ్ చేశారు. వీటిపై డీఈవో అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ పట్టణ కమిటీ సభ్యులు అఖిల్, నిఖిల్, హేమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా నరసాపురం ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నరసాపురం: అఖిల పక్ష కమిటీ ఆమోదం మేరకు నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా ఎంపిక చేసేందుకు అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం జనసేన కార్యాలయంలో అఖిల పక్షం కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తప్పిదంతో డివిజన్ కేంద్రంగా ఉన్న నరసాపురం నుంచి జిల్లా కేంద్రం తరలించారన్నారు. అప్పటి నాయకులు ప్రజల నమ్మకాన్ని పక్కకు నెట్టి జిల్లా కేంద్రం భీమవరం తరలించడం దురదృష్టకరమన్నారు. ఆ సమయంలో అనేక పోరాటాలు చేసిన ప్రయోజనం లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కమిటీలు వేయడం శుభ పరిణామన్నారు. నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. అఖిల పక్షం ఆశయం మేరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఇతర మంత్రులు వద్దకు తీసుకు వెళ్లి మాట్లాడతానన్నారు. జిల్లా కేంద్రం కోసం మీలో ఒక్కడిగా పని చేస్తాను. మీరు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా జరిగే విధంగా పని చేస్తాను. మనగోడు రాష్ట్ర ప్రజలకు తెలియ పరుద్దాం. అందరం కలసి పోరాడదాం... రాజధాని సాధిద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ జిల్లాలు ఏర్పాటుపై గతంలో జరిగిన తప్పులును సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం నూతన కమిటీ వేసిందన్నారు. నరసాపురం జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడం లో జరిగిన తప్పిదం, డచ్, బ్రిటిష్ కాలం నుంచి డివిజన్ కేంద్రంగా నరసాపురం ఉందన్నారు. పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని అర్హతలు ఉన్నాయి. భౌగోళికంగాను ఉన్న అవకాశాలను కమిటీ దృష్టికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తీసుకు వెళ్లాదామన్నారు. ప్రజాపక్ష నాయకుడిగా ఎమ్మెల్యేకు అధికారం ఉందన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తే భవిష్యత్తులోను ఎమ్మెల్యేగా మిమ్మల్ని గెలిపిస్తామన్నారు. అఖిల పక్షం కన్వీనర్, సీపీఐ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా నరసాపురం ఏర్పాటుకు కమిటీతో అన్ని వర్గాలు కలిసి పనిచేద్దామన్నారు. ప్రజలంతా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంగా నరసాపురం ఏర్పాటు తోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ దృష్టి కి గతం లో జరిగిన తప్పిదాలను తీసుకు వెళ్ళేందుకు అఖిల పక్షంలో భాగస్వామ్యులు కావాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రం గా నరసాపురాన్ని సాధించేందుకు కృషి చేద్దామన్నారు. డాక్టర్ ఇలపకుర్తి ప్రకాష్ మాట్లాడుతూ నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నరసాపురాన్ని ప్రత్యేక జిల్లా గా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. కోటిపల్లి సురేష్, పోలిశెట్టి శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయ రావు, పోలిశెట్టి బాబ్జీ, దొండపాటి స్వాములు, పోలిశెట్టి సూర్య చంద్రరావు, మైల వసంత రావు, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వర రావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమం లో కొప్పాడి రవి, వాతాడి ఉమామహేశ్వరరావు, గుబ్బల నాగ రాజు, చాగంటి సురేష్ పాల్గొన్నారు.

హైవేపై గుంతలు పూడ్చివేత

విశాలాంధ్ర, జీలుగుమిల్లి : తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి 516 డి తాటి యకులగూడెం గ్రామం వద్ద రహదారి పూర్తిగా గోతుల మయం అయ్యింది. ద్విచక్ర వాహనాలు, పెద్ద పెద్ద వాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఒక్కొక్క సారి ఆ గోతులలో పడి వాహనాలు పాడై పోతున్నాయి. దీనితో ఏలూరు జిల్లా జీలుగుమిల్లి ఎస్సై వి క్రాంతి కుమార్ స్పందించి జెసిబి సహాయంతో రహదారిని సదును చేయించి గుంతలను పూడ్చి వేయించారు. గత కొంతకాలంగా ఇక్కడ రహదారిపై గుంతలు ఉండడంతో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని వాహనదారులు వాపోయారు. స్థానికులు, వాహనదారులు ఎస్సైకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. జాతీయ రహదారి పై వెళ్లే లారీ డ్రైవర్లు ఎస్సై సార్ సలాం అంటూ అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఎమ్మెల్యే భేటీ

విశాలాంధ్ర, జీలుగుమిల్లి : పోలవరం ప్రాజెక్టు పురోగతి, భవిష్యత్తు కార్యాచరణ వంటి విషయాలపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌తో చర్చించి నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఆదివారం బర్రింకల పాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటనలో తెలి పారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన వ్యూహాలు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఆత్మీయంగా చర్చించినట్లు తెలిపారు. నియోజక వర్గంలో ఎదుర్కొంటున్న సమ స్యలు, అభివృద్ధి అవసరాలు, పోలవరం నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఎమ్మెల్యే బాలరాజు పేర్కొన్నారు.

ఘనంగా డిఎన్ఆర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర -భీమవరం: డిఎన్ఆర్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కళాశాలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని విద్యార్థిగా, విద్యార్థి నాయకుడిగా అధ్యాపకుడిగా పాలక వర్గంలో సంయుక్త కార్యదర్శిగా వివిధ హోదాల్లో పనిచేసే అవకాశం కలిగిందన్నారు. ఆ అనుభవం నాకు ఈ రోజున కేంద్ర మంత్రి స్థాయికి ఎదగటానికి కొంత మేర సహాయ పడిందన్నారు. పూర్వ విద్యార్థిగా, కేంద్ర మంత్రిగా డి.యన్.ఆర్ విద్యా సంస్థలకు నా వంతు సహాయాన్ని అందిస్తానని ఆయన పేర్కొన్నారు. శాసన మండలి సభ్యులు బొర్రా గోపీ మూర్తి మాట్లాడుతూ డియన్ఆర్ విద్యా సంస్థలో నాణ్యమైన విద్యను సమాజానికి అందిస్తున్నారని, నేను డియన్ఆర్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థిని అని తెలుపుటకు గర్విస్తున్నానన్నారు. మాజీ ఎంపి గోకరాజు గంగరాజు మాట్లాడుతూ విద్యా సంస్థల్లో పూర్వ విద్యార్థుల పాత్ర అనిర్వచనీయమైనదని అందువల్ల ఆయా సంస్థల ప్రగతికి కేవలం పూర్వ విద్యార్థులే కాకుండా పారిశ్రామిక సంస్థలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీగా భావించి భారీ స్థాయిలో ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలిపారు. తాను డియన్ఆర్ విద్యాసంస్థల ప్రగతికి సహకరించటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలియజేశారు. మాజీ శాసన మండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ తాను చదువు కొన్నప్పుడు నాటి అనుభవాలను నాటి అధ్యాపకులు విశిష్టమైన సేవలను సమావేశంలో వివరించారు. అలుమ్ని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ వి.యస్. రాజు మాట్లాడుతూ విద్యా సంస్థల ప్రగతికి పూర్వ విద్యార్థులు ఏ విధంగా సహాయ పడవచ్చు అనే విషయాన్ని విపులంగా తెలియజేశారు. ఈ విద్యాసంస్థల అభివృద్ధికి కావలిసిన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిఎన్ఆర్ పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహారాజు, సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం మండలాన్ని పశ్చిమలోనే ఉంచాలి : జేసీ

విశాలాంధ్ర - భీమవరం: త్వరలో జరుగనున్న జిల్లాల పునర్వ్యవస్థీకరణలో ఎటువంటి మార్పులు చేయకుండా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డివిజన్ పరిధిలో ఉన్న గణపవరం మండలాన్ని యథాతథంగా ఉంచాలని గణపవరం మండలం జెఎసి నాయకులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గణపవరం మండలంలోని 25 పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసీలు, జడ్పిటిసి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చేసుకున్న ఏకగ్రీవ తీర్మాన ప్రతులతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కు అందజేశారు. గణపవరం మండల రెవెన్యూ, పోలీస్ వ్యవస్థ కూడా భీమవరం డివిజన్ పరిధిలోనే కొనసాగాలని గణపవరం మండలానికి చెందిన పలువురు ఎంపిటీసీలు, సర్పంచులు వివిధ పార్టీల నాయకులు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ను కోరారు. గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోని ఉంచాలనే డిమాండ్ కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని కేంద్ర మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణితో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో లిఖిత పూర్వక లేఖను కూడా పంపిస్తానని వారికి కేంద్ర మంత్రి హామీ యిచ్చారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు చిట్టియ్యబాబు

విశాలాంధ్ర, వీరవాసరం: తన ఉపాధ్యాయ వృత్తితో అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత స్థానాలలో నిలబెట్టిన ఘనత యేలూరి చిట్టియ్యబాబు (చిట్టిబాబు)దని పలువురు పూర్వపు విద్యార్థులు కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టిబాబు మాస్టారు సంతాప సభ యుటీఎఫ్ మండల కార్యదర్శి, ఎం.ఆర్.కె జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి ముద్రగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక చిట్టిబాబు స్వగృహం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగాఏస్టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరి, చిట్టిబాబు అల్లుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తి చేపట్టడానికి ఆసక్తి చూపనప్పటికీ తన మామగారైన చిట్టిబాబు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ వారి కుటుంబ సభ్యులు ఇదే వృత్తిలో ఉండటం వల్ల ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నా నన్నారు. ఆయన సలహాతోనే ఉపాధ్యాయ సంఘానికి నాయకుడుగా బాధ్యతలు తీసుకుని తద్వారా ఉపాధ్యాయులకు మరింత చేరువైనా నన్నారు. ముద్రగళ శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఉపాధ్యాయ వృత్తితో మార్గ దర్శకులుగా ఉండటం వల్ల నేడు అనేక మంది నాటి విద్యార్థులు నేడు ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. వీరవాసరంరాయకుదురు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పని చేసిన చిట్టిబాబు మాస్టారు విద్యార్థులపై చెరగని ముద్ర వేశారన్నారు. అనంతరం చిట్టిబాబు మాస్టారు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుమారుడు యేలూరి సత్యశ్రీనివాస్, కుమార్తెలు భానుకుమారి, సంధ్యా రాణి, పూర్వపు విద్యార్థులు జానకిరామ్, రాము, మంగతాయారు, ఆర్కె. నాయుడు, నళిని మోహన్, ఇతర పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

విశాలాంధ్ర - ధవళేశ్వరం (రాజమండ్రి రూరల్): సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 8.35 నిమిషాలకు 11.75 అడుగులకు చేరిన గోదావరి నీటి మట్టం. బ్యారేజ్ నుండి 175 గేట్లు పైకెత్తి 10.01 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్ర జలాలకు విడుదల. బ్యారేజ్ వద్ద గోదావరి వరద మరింత పెరగనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. మూడు ప్రధాన పంట కాలవలు ద్వారా 11,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిమజ్జనాలలో తొందరపాటు చర్యలొద్దు : ఎస్పీ

విశాలాంధ్ర - తాళ్లపూడి : గణపతి నిమజ్జనాల విషయంలో జాగ్రత్తలు పాటిం చాలని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ సూచించారు. పోలీస్ సూచనలతో వారు నిర్ణయం చిన ప్రదేశాల్లోనే నిమజ్జనాలు చేయాలని, ఎటు వంటి తొందరపాటు నిర్ణ యాలు కానీ, చర్యలు కాని లేకుండా డీజేలు లేని ఊరేగింపులు మాత్రమే జరుపుకోవాలని ఆదేశించారు. తాళ్లపూడి మండలంలోని పలు గోదావరి రేవులు ఆయన పరిశీలించి, గణపతి మండపాలు సందర్శించారు. అన్న దేవరపేట గ్రామంలో వినాయకుని మండపం దగ్గరకు వచ్చిన ఎస్పీ అక్కడ కమిటీ సభ్యులు, భక్తులతో మాట్లాడి వారికి వినాయక నిమజ్జనానికి సంబంధించి సూచనలు చేశారు.

ఎరువులు కొరతతో రైతులు విలవిల

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతిరాజు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రైతులను యూరియా కొరత తీవ్రంగా వెంటాడు తుందని ఈ సమస్యను వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని పరిష్కారం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేపూడి జ్యోతి రాజు కోరారు. ఈ సందర్భం గా ఆయన ప్రకటన విడుదల చేశారు నేటికీ పూర్తి స్థాయిలో ఎరువులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సొసైటీల వద్ద రైతులు పడి కాపులు కాస్తున్నారని బ్లాక్ మార్కెట్కు తల్లి వెళ్లి పోతుందని ఆయన విమర్శించారు. జిల్లాలో రైతు సేవ కేంద్రాల వద్ద ఎరువుల అమ్మకాలు జరుగుతున్న దాఖలాలు కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కొరత తీవ్రంగా ఉంటే ఆందోళన బాట చేపడతామని జ్యోతి రాజు కోరారు.

ఎరువుల తనిఖీలు

విశాలాంధ్ర - దేవర పల్లి: మండలంలో ఎరు వుల తనిఖీలు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారు లతో కలిసి దేవరపల్లి మండలంలో ఎరువుల షాపులపై తనిఖీలు నిర్వ హించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపి కృష్ణ, తహసీ ల్దార్ విజయ్ కుమార్ నేతృత్వంలోని బృందం, మండల వ్యవసాయ అధి కారి కమల్ రాజ్, గోపాలపురం వ్యవసాయ అధికారి ఏసుబాబు దేవరపల్లి ప్రాథమిక సహకార సంఘంలో ఎరువుల నిర్వహణను పరిశీలించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసు కుంటామని. రైతులకు అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు సరఫరా చేయాలని సూచించారు.

పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందని స్మార్ట్ రేషన్ కార్డులు

- పంపిణీలో గందరగోళం
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర - సీతానగరం: ఒకటవ తేదీకి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందేనా?. మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విప్ల వాత్మక మార్పుల్లో ఒకటి అయినా హరిహులు అయినా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పం పిణీ ఒకటి. ఈ పంపిణీ ప్రక్రియ ఒక పద్ధతిలో జరగకపోవడం వలన పూర్తి స్థాయిలో లబ్ధిదారు లకు అందని స్మార్ట్ కార్డులు. ఈ పంపిణీ ఒకే చోట చేయడం, పంపిణీ నమోదు చేసే వెబ్సైట్ సరిగా పని చేయకపోవడంతో లబ్ధిదారులకు తప్పని ఇక్కట్లు. పంపిణీ చేసే ప్రక్రియ పై మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమ ఇష్టా నుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తు న్నారు. అలాగే ఈ రేషన్ కార్డులలో కొంత మంది లబ్ధిదారులకు రాకపోవడంతో గందరగోళం ఏర్ప డుతుంది. ఈ సమస్యలపై ఉన్నత అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునే విధంగా లబ్ధిదారులు అయినా ప్రజలు ఇబ్బం దులు కలగకుండా అధికారులు చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముల్లంకల్లంక గ్రామ రాకపోకలపై అధికారుల అప్రమత్తం

విశాలాంధ్ర - సీతానగరం: ముల్లంకల్లంక గ్రామ రాకపోకల పై అధికారులు అప్రమత్తం అయ్యారు. మండలంలో ఏకైక లంక గ్రామం అయినా ముల్లకల్లంక గ్రామానికి పెరుగుతున్న గోదావరి వరద దృష్ట్యా తహసీల్దార్ శ్రీనివాస్ ముం దుస్తు చర్యల్లో భాగంగా చిన్న బోట్లను నిలిపివేసి పెద్ద బొట్టును ప్రజలకు ఏర్పాటు చేశారు. అలాగే ఆదివారం స్వయంగా తహసీల్దార్ శ్రీనివాస్ బోటు పై బొబ్బిల్లంక గ్రామం నుండి ముల్లంకల్లంక గ్రామానికి వెళ్లి అక్కడ పరిస్థితులను పర్యవేక్షిం చారు. అలాగే ఇప్పటికే మండల వైద్య ఆరోగ్య సిబ్బంది అక్కడ గత కొద్ది రోజులుగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముల్లంకల్లంక గ్రామంలో పరిస్థితి అంతా సానుకూలంగా ఉందని అన్నారు. లంక గ్రామ ప్రజల రాకపోకలకు ఏ విధమైన ఇబ్బందులు లేవని అన్నారు. అలాగే వరద ఉధృతి ఉండడంతో అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించడం జరిగింది అని అన్నారు. ఇక్కడ పరిస్థితుల పై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటునాము అని అన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో శ్రీహరికి ఫస్ట్ ర్యాంక్

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో వెస్ట్ గోదావరి జిల్లా లో 250వ ర్యాంక్, ఎస్టీ కేట గిరిలో జిల్లాలో మొదటి ర్యాంక్ను తాళ్ల పూడి ఎస్టీ కాలనీకి చెందిన చెరుకూరి శ్రీహరి సాధిం చాడు. తల్లితండ్రులు ఇద్దరు కూలి పనులు చేసుకుని జీవిస్తుంటారు. చిన్నప్పటి నుండి ప్రభుత్వ పాఠశాల లోనే చదువును కొనసాగించాడు. 2018 నుండి, విజేత, సాయి తదితర విద్యాసంస్థల్లో టీచర్గా చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేసాడు. సి.ఐ. ఎస్.ఎఫ్, ఆర్.ఆర్.బి, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగా లకు హాజరయ్యాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డి.ఎస్.సి పరీక్షల్లో ఎస్.జి.టి పోస్టుకు ఎస్టీ కేటగిరీలో జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్, సాధించాడు.

మహా అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్ల కోట పట్టణంలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవములు స్థానిక సం పంగి తోట యూత్ అసోసియేషన్ ఆధ్వర్యం లో కాలనీ వాసులు ఘనంగా నిర్వహిస్తు ఆది వారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, పట్టణ గౌర అధ్యక్షులు అడబాల కుమారస్వామి, మున్సి పల్ కౌన్సిలర్ బలుసు వాసు, టిడిపి నాయ కులు వల్లూరు గాంధీ, 23వ వార్డు టీడీపీ నాయ కులు పడాల వీరబాబు, వైసిపి కౌన్సిలర్ సురేష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

చిన్నారికి ఆపన్న హస్తం అందించండి

- తల్లిదండ్రుల వేడుకోలు

విశాలాంధ్ర - కొవ్వూరు : అందరి పిల్లలు లాగా తమ పిల్ల కూడా ఆడు కోవాలని తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూశారు. అయితే విధి వక్రీకరిం చడం తో తమకళ్ళ ముందే ఆ చిన్నారి మం చం మీద పడిన ఉండడాన్ని ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. వివరాల్లోకి వెళితే ఆ తల్లిదండ్రులకు లేక లేక ఆడపిల్ల జన్మించింది. పుట్టింది మహాలక్ష్మిని వారు సంబర పడినంతసేపు ఆ సంతోషం నిలవలేదు. తరచూ తమ రెండే ళ్లయిన నిండని తమ చిన్నారి అనారోగ్యానికి గురవడంతో తిప్పని ఆస్పటల్ లేవు, తిరగని గుళ్ళు గోపురాలు లేవు. ఇక ఆ చిన్నారి పేరు విషయానికి వస్తే.. సంగాపు ధృతిక శ్రీవ ల్లిక. ఆ బాలిక వయస్సు సుమారు రెండు సంవత్సరాలు. అనేక ఆసుపత్రులు తిరగ్గా కొంతమంది సన్నిహితులు పాప ను హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. ఈ నేపధ్యల్లో వారు వీరు దగ్గర అప్పు చేసి హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ టెస్టులు చేయగా ఆ చిన్నారికి లివర్ వ్యాధి ఉందని, వెంటనే లివర్ మార్చాలని సూచించారు దాదాపు 25 లక్షల ఖర్చు అవుతుందని అంచనా వేసి బిల్లు ఇచ్చారు. దీంతో అయోమయ స్థితిలో పడిన ఆ తల్లిదండ్రులు జాలి గలవారు ఆపన్న హస్తం అందించాలని వారు కోరుతున్నారు.

బాలసదనంలో క్రీడా పోటీలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తూర్పుగోదావరి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడు స్తున్న బాలసదనంలో జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా బాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు ఆదివారం రాజమండ్రి బాలసదనం, కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి టి.శ్రీదేవి మాట్లా డుతూ, ఇటువంటి క్రీడా కార్యక్రమాలు పిల్లల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా వారి ప్రతిభను గుర్తించడానికి మంచి వేదికగా ఉపయోగ పడతా యని అన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రేవు అనంత ప్రదీప్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు బాలల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో ఉపయోగ కరమని అభిప్రాయపడ్డారు. ఈ రోజు తాడు ఆట, లెమన్ స్పూన్, క్యారమ్, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిసిపిఓ ఆర్. అనంత ప్రదీప్, సోషల్ వర్కర్ శిరీష, సూపరింటెండెంట్ జి. రోజరాణి, బాలసదనం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నారుమడి దశ నుండే పొగాకు బోర్డు నియంత్రణ చర్యలు



విశాలాంధ్ర - దేవరపల్లి : ఎన్ఎల్ఎస్ పొగాకు నియంత్రణలో భాగంగా నారుమడి దశ నుండే పొగాకు బోర్డు నియంత్రణ చర్యలు తీసుకుంటుందని దేవరపల్లి పొగాకు వేలం నిర్వాహాధికారి హేమ స్మిత పేర్కొన్నారు. దేవర పల్లి పొగాకు వేలం కేంద్రంలో ఆమె మాట్లా డుతూ ఈ సంవత్సరం అధికంగా పొగాకు ఉత్పత్తి కారణంగా మార్కెటింగ్ విషయంలో అనేక సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారని , 2025 టు 2026 సంవత్సరంలో పొగాకు 142 మిలియన్ కిలోలు ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిందని హేమ స్మిత తెలిపారు. పొగాకు నారుమడి దశ నుండి పొగాకు బోర్డు నియంత్రణ చర్యలు చేప డుతుందని రైతులు సహకరించాలని ఆమె కోరారు. నారుమళ్లు కట్టే రైతులు విధిగా పొగాకు బోర్డు అను మతి తీసుకోవాలని బోర్డులో రిజి స్టర్ అయిన రైతులు మాత్రమే నారుమళ్లు కట్టాలని ఆమె తెలి పారు. ప్రతి రైతు 2 హెక్టార్ల వరకు రిజిస్ట్రే షన్ చేసుకోవచ్చుని ఆమె తెలిపారు వాణిజ్య సరళిలో పొగాకు నారుమళ్లు కట్టే రైతులు బోర్డు నియమ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అన్నారు. నారుమళ్లు పెంచే రైతులు విధిగా పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. నారుమడికి అనుకూ లమైన నేలను, నీటి వనరులు ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకోవాల న్నారు. నారుమడి పొడవు పది మీటర్లు వెడల్పు 1.2 మీటర్లు మించకుండా ఉండా లని తెలిపారు. పెంప కంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల రిజిస్ట్రే షన్ చేయని రైతుల నుండి నారు కొనుగోలు సాగు చేస్తే ఆ రైతుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరిం చారు రిజిస్ట్రేషన్ చేసిన నారు ముళ్లను నిత్యం పొగా కు బోర్డ్ అధికారులు ఫీల్డ్ ఆఫీ సర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు పొగాకు బోర్డు చట్ట ప్రకారం ఆరోగ్యకర మైన పొగాకును ఉత్పత్తి చేయా లని తెలిపారు. అంత ర్జాతీయ పొగాకు మార్కెట్లో ఎన్ఎల్ఎస్ పొగాకు ఇమేజ్ పెంచాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ఎన్ఎల్ స్ ఏరి యాలో పండించే పొగాకు నాణ్యమైనదని దీనిని దృష్టి లో పెట్టుకుని రైతులు తప్పనిసరిగా బోర్డు నియంత్రణకు లోబడి నారుమళ్లు పెంచి నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని హేమ స్మిత కోరారు అంతర్జాతీయ ప్రమా ణాలు కనుగొనంగా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేసి రైతులు ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరాలని ఆమె ఆకాంక్షించారు

విశ్వ సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా నక్కిన

విశాలాంధ్ర - మండపేట : ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ విశ్వ సాహితీ కళావేదిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా మండపేటకు చెందిన తెలుగు పండితుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయిత, జాతీయ, అంతర్జాతీయ అవార్డుల గ్రహీత నక్కిన వీరరాఘవరావు నియమితులయ్యారు. ఈ మేరకు తనను నియమించినట్లు ఆ సంస్థ చైర్‌పర్సన్ కే రమావతి ప్రకటించారని రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాలతో పాటు రాష్ట్ర విద్యా శిక్షణ సంస్థలో విషయ నిపుణునిగా విశిష్ట సేవలందిస్తున్న నక్కిన వీర రాఘవరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కోనసీమ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్, ప్రముఖ కవి, రచయిత టి నరేంద్ర, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

ఆక్వా అథారిటీ డైరెక్టర్‌గా విత్తనాల బుజ్జి

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోనకు చెందిన విత్తనాల నాగ శ్రీనివాస్ (బుజ్జి) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన 9 మంది అథారిటీ జాబితాలో శ్రీనివాస్ ఒకరు. శ్రీనివాస్ ఆది నుంచి తెలుగుదేశం కార్యకర్తగా పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా బీసీ వర్గాలు తరపున ఈ పదవి వరించింది. శ్రీనివాస్‌కు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు నడింపల్లి సుబ్బరాజు, చెల్లి అశోక్, కముజు లక్ష్మీరమణారావు, వెంట్రు సుధీర్, చెల్లి సురేష్, జంగా శ్రీనివాసరావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, మోకా అప్పాజీ, కాండ్రేగుల సత్య ప్రసాద్ అభినందనలు తెలిపారు.

విద్యాంజలి ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్టాపన

విశాలాంధ్ర - కాకినాడ : రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో స్పాన్సర్ చేసిన విద్యాంజలి హైస్కూల్లో ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్టాపన ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షులుగా పి ఐశ్వర్య, కార్యదర్శిగా ఒమేరా మెహరీన్, ఉపాధ్య క్షులుగా పి మహలక్ష్మి, కోశాధికారిగా పిజ కాటూన్, క్లబ్ అడ్వైజ రగా కే శివాజీ, పోలియో చైర్ పర్సన్‌గా లోకేష్ సాయి ఫణీంద్ర ఇంటర్నేషనల్ సర్వీస్ డైరెక్టర్గా కే వివేక్, ప్రాజెక్ట్ డైరెక్టర్గా పి ఆదిత్య, యూత్ సర్వీస్ డైరెక్టర్గా ఎన్ మాన్వి దేవి బాధ్యత స్వీకరిం చారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఉపాధ్యక్షులు పవన్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన రోటరాక్ట్ ఇంటరాక్ట్ సబ్ కమిటీ చైర్పర్సన్ చిరంజీవి రెడ్డి, నేతి నాగేశ్వరరావు, విద్యాంజలి పాఠశాల ప్రిన్సి పాల్ సంధ్య, పలువురు పాల్గొని క్లబ్ కార్యవర్గ బాధ్యతలు స్వీక రింప చేశారు. క్లబ్ ఉపాధ్యక్షులు మాజేటి పవన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి సేవా కార్యక్రమాల నిర్వహణలో విద్యా ర్థులను భాగస్వామ్యం చేయాలన్న ప్రధాన ఆశయంతో అంతర్జా తీయ సంస్థ ఇంటరాక్ట్ క్లబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. క్లబ్బు ఏర్పాటుకు విద్యాంజలి పాఠశాల యాజమాన్యం అవకాశం కల్పించడం పట్ల చిరంజీవి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - కరప : మండలంలోని నడకుదురు గ్రామంలో షాపు నెంబరు 6లో క్యూ ఆర్ కోడ్ రైస్ ఆధారిత రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్టు తహశీల్దారు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో ఈ కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. రేషన్ కార్డ్ లబ్ధిదారులు ఉదయం షాప్ దగ్గర ఉండాలని కోరారు.

వ్యర్థాలతో మూతపడ్డ రామచంద్రుడు కాలువ

- పొలాలకు నీరందక రైతుల గగ్గోలు

విశాలాంధ్ర - మండపేట : పట్టణంలోని రామచంద్రుడు పంట కాలువ వ్యర్థాలతో పూర్తిగా మూత పడింది. ఈ కాలువ మున్సిపల్ పరిధిలోని 30వ వార్డు సంఘం కాలనీ నుంచి బైపాస్ రోడ్డు, గాంధీనగర్, సైథిల్ పేట, ఏడిద రోడ్డు, రావులపేటల మీదుగా గొల్లపుంత వీధుల నుంచి గొల్లపుంత గొడ్డుకాలువ వరకూ దాదాపు 7 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ కాలువ గుండా ఏడాపెడా వందలాది ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పొలాలకు పంట నీరు అందించడానికి ఈ కాలువే జీవ నాడి. రైతులంతా ఈ కాలువపై ఆధార పడే పంటలు పండిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అక్కడక్కడ కొంత మంది రైతులు బోర్లపై పంటలు పండిస్తారే తప్ప అధిక శాతం పొలాలకు నీరందించి జీవం పోసేది రామచంద్రుడు పంట కాలువే. ఈ విధంగా వందలాది ఎకరాల పంట క్షేత్రాలకు జీవనాధారంగా ఉన్న ఈ కాలువ దుస్థితి అధ్వాన్నంగా మారిందని రైతులు వాపోతున్నారు. పట్టణంలోని పలు వీధుల వెంబడి ప్రవహిస్తున్న ఈ కాలువ చెత్తా చెదారాలతో నిండి పోయింది. ప్రస్తుతం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పుడు పంటలకు దండిగా నీరు పెట్టాల్సి ఉంది. చెత్తా చెదారాలతో ఈ కాలువ మూసుకుపోవ డంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. వీధుల్లోని ప్రజలు తమ ఇళ్ల ద్వారా పేరుకు పోయిన అనేక రకాలైన చెత్త, వ్యర్థాలను కాలువలో జార విడుస్తున్నారు. అక్కడక్కడ కొంత మంది మాత్రమే ఇళ్ల చెత్తను పారిశుధ్య కార్మికులకు అప్పగిస్తున్నారే తప్ప చాలా మంది ప్రజలు కాలువ దగ్గరగా ఉండడంతో అందులోకి విసిరేస్తున్నారు. ఫలితంగా పంట కాలువ మూసుకు పోతోంది. పండుగల సమయంలో ఇళ్లు శుభ్రం చేసిన తర్వాత పోగైన పనికిరాని గృహోపకరణ వస్తువులు అనగా పరుపులు, దుప్పట్లు, పందిళ్ళు వేసినప్పుడు తొలగించిన కొబ్బరి ఆకులు, జీలుగుబండి అట్టలు మొదలైనవి చెత్త ట్రాక్టర్‌లో గానీ నిర్దేశించిన చెత్త కుప్పల్లో గానీ విడిచి పెట్టకుండా ఈ కాల్వలో పారేయడం వల్ల తరచూ ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. గతంలో పాలక వర్గం, మున్సిపల్ అధికారులు ఇలాంటి పనులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేవారు. అయితే ఈ మధ్యకాలంలో పురపాలక సంఘ అధికారులు గానీ, పాలకవర్గం గానీ, నీటిపారుదల శాఖ అధికారులు గానీ సరిగా పట్టించుకోవ డంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చూసి చూడనట్టు వదిలేయడంతో చెత్తాచెదారాలను విచ్చల విడిగా కాలువలోకి విసిరేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీనివల్ల కాలువ మూసుకుపోయి పంట పొలాలకు అవసరమైన సమయంలో సక్రమంగా నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఐక్యతగా ముందుకు సాగాలి

విశాలాంధ్ర - పెదపూడి : బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అందరూ ఐక్యతగా ముందుకు సాగాలని రాష్ట్ర 93 బీసీ కులాల అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు అన్నారు. గండ్రేడు గ్రామంలో ఉమమహేశ్వర రజక సంఘం అధ్వర్యంలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు, బాస్కర్ గణేష్బాబు, మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్య క్షుడు సిద్ధాంతుల కొండబాబు, రాష్ట్ర రజక కార్పొరే షన్ డైరెక్టర్, అల్లం వెంకటదాన మెంటారావు, నియోజకవర్గం రజక చైతన్య సేవా సంఘం కన్వీనర్ ముర మళ్ల వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయ కుడు మంద పల్లి సత్యనారాయణ, సీపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, కాటన్ దొర, దివంగత మాజీ సీఎం ఎన్టీరామారావు, విగ్రహాలకు, చాకలి ఐలమ్మ, గాడ్జేబాబా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో మొక్క లు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉమా మహేశ్వర రజక సంఘం కార్యాలయం ప్రారంభించారు. సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రకారం చెందాల్సిన పౌర హక్కులు, స్వేచ్ఛ, రాజకీ యంగా రావాల్సిన పదవులు కోసం సమిష్టిగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవిలత, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, స్థానిక రజక సంఘం అధ్యక్షుడు మలంపాక వీరబాబు, ప్రతి నిధులు కస్సురి స్వామి ఎలుచూరి మణికంఠ, శ్రీను, రమణ. దేవగు ప్తాపు సాంబమూర్తి, దేవగుప్తాపు సత్తిబాబు పాల్గొన్నారు.

పెన్నులు, పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - మండపేట : పట్టణంలోని 4వ వార్డు తరవాణిపేట లో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యా గణపతి పూజలు నిర్వ హించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ప ర్సన్ పతివాడ నూక దుర్గారాణి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు పూజల్లో ఉంచిన పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వర ప్రకాష్, నాలుగో వార్డ్ కౌన్సి లర్ గుండు రామతులసి, పట్టణ టీడీపీ అధ్య క్షుడు మచ్చానాగు, ఆలయ కమిటీ సభ్యులు వీర తాతరాజు, గ్రంధి బుల్లిబాబు, జాయన సాయి సత్యనారాయణ, మోహనరావు, పాలమూరి శ్రీనివాస్, పాలమూరి త్రినాథ్, కోడూరి నాగరాజు, ఆరేటి మహేష్, బొల్లంరెడ్డి స్వామి, రెడ్డి రవిరాజు, కే రామకృష్ణ, ఏ కృష్ణ పాల్గొన్నారు.

ప్రసన్న కుమార్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - కొత్తపేట : విజయవాడ అడిష నల్ డీసీపీగా ఉద్యోగ విరమణ చెందుతున్న ఎవిఎల్ ప్రసన్ కుమార్ తన నియోజకవర్గంలో చేసిన సేవలు ప్రశంసనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు కొనియాడారు. విజయవాడ జ్యోతి కన్వె న్షన్ హాల్లో ఆదివారం జరిగిన ప్రసన్నకుమార్ ఉద్యోగ విరమణ వేడుకలకు ఆయన ముఖ్య అతిథి గా విచ్చేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లా డుతూ 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రసన్న కుమార్‌తో మంచి పరిచయాలు ఉన్నాయని, ఆయన గురించి తెలుసుకుని రావులపాలెం స్టేషన్‌కు ఎస్సైగా తీసుకొచ్చామన్నారు. అనంతరం రావులపాలెంకు సిఐగా తీసుకొచ్చినట్లు తెలిపారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పెద్ద పోలీస్ డివిజన్‌గా ఉన్న అమలాపురం డిఎస్పీగా సేవలందించారన్నారు. చివరిగా అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఏఎస్పిగా తీసుకురావాలనే ప్రయత్నం ఫలించలేదన్నారు. ప్రసన్న కుమార్ ఉద్యోగ నిర్వహణలో ఎంతో నిబద్ధతగా ఫ్రెండ్లీ పోలీసుగా ఉంటూ ఎలాంటి మరకలు లేకుండా విరమణ చెందడం అభినంది నీయమన్నారు. నేటి పోలీసులకు ఆయన ఎంతో ఆదర్శమని కొనియాడారు. ప్రసన్నకుమార్, సావిత్రి దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అలాగే కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌తో తనకు ఎంతో అనుబం ధం ఉందన్నారు. ఆయన తన లాంటి ఎందరికో ఆదర్శనీయులన్నారు. అందర్నీ కలుపు కుంటూ అందరి మన్ననలు అందుకుంటూ ఉద్యోగ నిర్వహణ ఆయనకే చెల్లిందని కొని యాడారు. ఈ ఉద్యోగ విరమణ వేడుకల్లో కొత్తపేట నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆకుల రామకృష్ణ, సలాది రామకృష్ణ, ధర్నాల రామకృష్ణ, చల్లా ప్రభాకర రావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, గుబ్బల మూర్తి, రావుపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, సీనియర్ జర్నలిస్టు బోగిశెట్టి నాగేశ్వరావు, కొండ్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోర్స దేవాలయ భూముల్లో వ్యవసాయ పనులు చెట్లను నరికించిన ఆక్రమణ రైతులు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : గోర్స గ్రామంలో ఉన్న శ్రీ సీతారామస్వామి దేవాలయ భూములు ఎటువంటి వ్యవసాయ పనులు చేపట్ట వద్దని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన కొంతమంది వ్యవసాయ పనులను చేపట్టడమే కాకుండా భూమిలో ఉన్న గట్లపై చెట్లను అక్రమంగా తొలగిస్తున్నారని కొత్తపల్లి పోలీసులు రైతులపై ఆదివారం కేసు నమోదు చేశారు. కొమరగిరి గ్రామంలో 121, 122 సర్వే నెంబ ర్లలో గోర్స దేవాలయానికి 20 ఎకరాల భూమి చాలాకాలంగా తామే సాగు చేస్తున్నామని కొంతమంది అక్రమదారులు అలాగే ఆ భూమి దేవునిది అని దేవాదాయ శాఖ మధ్య కొంతకాలంగా వివాదం కోర్టులో పెండింగ్లో ఉంది. అయితే ఆక్రమణ రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు ప్రయత్నం చేశారు. దీంతో గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆక్రమణదారుల వ్యవసాయ పనులను అడ్డు కోవడంతో కోర్టు స్టే ఆర్డర్ మంజూరు చేసింది. కొన్ని రోజులు మౌనంగా ఉన్న ఆక్రమణ రైతులు దేవాలయానికి చెందిన భూముల్లో వ్యవసాయ పనులు చేప ట్టారు. ఇంతటితో ఆగకుండా గట్టుపై ఉన్న చెట్లను నరికించారు. దీంతో విష యం తెలుసుకున్న సర్పంచ్ రొంగల వీరబాబు గ్రామస్తులతో వ్యవసాయ పనులు చేపట్టారని హెచ్చరించిన ఆక్రమణ రైతులు పట్టించుకోకుండా వ్యవసాయ పనులు చేపట్టడంతో తహశీల్దార్ చిన్నారావుకు ఫిర్యాదు చేయడంతో తాసిల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో కిషోర్ ఆక్రమంగా చెట్లు నరికిన వ్యక్తులను, వ్యవ సాయ పనులు చేపట్టిన రైతులపై కొత్తపెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దీనిపై ఎస్సై జి వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఓఎన్జిసి నష్ట పరిహారం అందరికి అందించాలి : తోట

విశాలాంధ్ర - యానాం : నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఓఎన్జిసి గ్యాస్ పైప్ లైన్ లీక్ సంబంధించి చమురు సంస్థలు నష్ట పరిహారం నియోజకవర్గంలో ప్రజలందరికీ అందించాలని ప్రముఖ వ్యాపారవేత్త రాజకీయ నాయకులు తోటరాజు డిమాండ్ చేశారు. స్థానిక పెర్రి రోడ్డులో గల గాజుల గార్డెన్ కళ్యాణ మండపంలో తోటరాజు ఫాలోవర్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభా కార్యక్రమంలో యానాం ఊరు కోసం ఊరు బాగు కోసం అభివృద్ధి కోసం సంక్షేమం కోసం తోటరాజు ఎప్పుడు ముందుంటాడని ఎవరికి ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని అన్నారు. తనను రాజకీయాల్లోకి రావాలని ఎవరు ప్రలోభ పెట్టలేదని తన సొంత నిర్ణయమే తప్ప వేరే ఎవరు ప్రోత్సహించలేదన్నారు. ఓఎన్జిసి పరిహారం కోసం సోమవారం 11 గంట లకి పుదుచ్చేరి గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, ఎంపీ తదితరులను కలిసి వినతి పత్రం అందించనున్నామన్నారు. ఈనెల ఎనిమిదో తేదీన తొలి అడుగు కార్యక్రమంతో ప్రజల ముందుకు వచ్చానని ఈరోజు వరకు ఎవరైనా సహాయం కోరి తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాను అన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది యువత తోటరాజుతో నడవడానికి సిద్ధపడి తోటరాజు ఫోటో ఉన్నటువంటి కండువాలను ధరించారు. ఈ సందర్భంగా అభిమా నులు ఘనంగా సత్కరించారు. సభాధ్యక్షులు రెడ్డి సత్య శంకర్, కోటి మున్నా, కోలా సత్యనారాయణ, కర్రి పేర్రాజు, పెసంగి బాబి, దండుప్రోలు రామకృష్ణ, కోన సూరిబాబు తదితరులు తోటరాజు సేవా కార్యక్రమాలను ఉద్దేశించి మాట్లాడారు. వివిధ గ్రామాల నుండి యువత, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకిత భావాలు అలవరుచుకోవాలి

విశాలాంధ్ర - పెదపూడి : విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు అంకిత భావాలు అలవరుచుకోవాలని పెద్దాడ పీహెచ్సీ వైద్యులు డి ప్రత్యుష అన్నారు. పెద్దాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన జి వెంకటరావుకు అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో నిస్వార్థ సేవలతో ప్రజలకు అందుబాటులో సేవలందించాలని, అప్పుడు ప్రజల ఆదరణ అభిమానాలు పొందుతారన్నారు. అనంతరం సన్మాన గ్రహీత దంపతులకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు బి సురేఖ, ఏవీ పద్మావతి, చంద్రారెడ్డి, సిబ్బంది బి సుకుమార్, డి మురళీ, టీ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ డి అమ్మాజీ పాల్గొన్నారు.

కేదారి లోకేష్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కేదారి శేఖర్ కుటుంబాన్ని ప్రత్తిపాడు నియోజవర్గ వైసిపి నాయకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి కృష్ణంరాజు పలకరించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. కేదారి శేఖర్ కుమారుడు లోకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సందర్భంగా మురళీరాజు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న శేఖర్‌ను ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని రూ.ఐదు వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రశాంతంగా తహశీల్దార్ రాత పరీక్ష

విశాలాంధ్ర - యానాం : యానాంలో డిప్యూటీ తహశీల్దార్ రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఐదు నిమిషాలు ఆలస్యం కావడంతో సిబ్బంది వెనక్కి పంపించేశారు. ఈ పరీక్ష కోసం హైదరాబాదు నుండి వచ్చామని కాస్త బస్సు ఆలస్యమైందని ఎంత ప్రాధేయపడ్డా అధికారులు కనికరించలేదు. ఎంత బ్రతిమాలిన టైం అంటే టైం అని పరీక్షసిబ్బంది వెనక్కి పంపించడంతో ఏమి చేసేది లేక ఎంతో బాధతో ఇద్దరు విద్యార్థులు వెనుతిరిగివెళ్లిపోయారు.

ఘనంగా ప్రజాకవి ఆరుద్ర శతజయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - కడియం : అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని సాహితీ మూర్తుల్లో "ఆరుద్ర" ఒకరని చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజాకవి ఆరుద్ర (భాగవతుల సదాశివ శంకర శాస్త్రి) శతజయంతి ఉత్సవాలు ఆదివారం కడియంలో చెళ్లపిళ్ల కళా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఘనంగా జరిగాయి. సమితి గౌరవాధ్యక్షులు తోరాటి వసంతరావు ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి, తెలుగు సినిమాలకి తన మాటలు, పాటలు, రచనల ద్వారా ఆరుద్ర చేసిన సేవలు అజరామరం అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఏర్పాటుకు ఆరంభ సభ్యులు మాత్రమే కాకుండా తెలుగు నాటకాలు, నాటికలు పాటలకు, కవితలు, పద్యాలు ఎన్నో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారిలో ఆరుద్ర ఒకరని, తెలుగు సాహిత్యం మీద లోతైన పరిశోధన చేయడమే కాకుండా ఇంగ్లీషు, హిందీ, తమిళం నుంచి కూడా ఎన్నో రచనలను తెలుగులోకి అనువదించిన బహుముఖీన భాషా సాహితీవేత్త ఆరుద్ర అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా అరసం అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు ఉంగరాల భద్రరావు చెళ్లపిళ్ల కమిటీ సభ్యులు బొర్రా రామకృష్ణ, రాజేష్, కడించర్ల కోటి, రేలంగి శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కాజులూరు : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమాజానికి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం కాజులూరులో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. స్థానిక జనసేన పార్టీ నాయకులు అన్యం శ్రీరామ్ ఆధ్వర్యంలో, సెప్టెంబర్ 2న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా తనదైన శైలిలో ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ, సమాజాన్ని జాగృతం చేసే కార్యక్రమాలు చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఏఎంసి చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ మానవతా విలువలు ఉన్న గొప్ప నాయకుడుగా, మంచితనానికి నిదర్శనంగా డిప్యూటీ సీఎం ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. జనసేన ఇంచార్జ్ పోలిసెటి చంద్రశేఖర్, గంధం పళ్ళం రాజు, యాళ్ళ కృష్ణారావు, దేగల సతీష్, దుగ్గిన బాబ్జి, యువసేన సతీష్ తదితరులు మాట్లాడుతూ విలువైన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన అన్యం శ్రీరామ్‌ను అభినందిస్తూ, వారి తండ్రి స్వర్గీయ అన్యం గోవిందు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను మంత్రి సుభాష్ తదితరులు ప్రశంసించారు.

కన్నబాబుకు ఎమ్మెల్యే సత్యప్రభ అభినందన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఖాది, విలేజ్ ఇండస్ట్రీల మండలి రాష్ట్ర డైరెక్టర్‌గా, టిడిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్, నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కొమ్ముల (తిరుపతి కుమార్) కన్నబాబు నియమించబడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆదివారం ఉత్తర్వులు అందాయి. గడిచిన 25 ఏళ్లుగా టిడిపిలో సీనియర్ నేతగా, పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న కన్నబాబుకు ఖాదీ బోర్డు డైరెక్టర్ పదవి ఇవ్వడంపై పలువురు ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఖాదీ బోర్డు సభ్యుడిగా నియమి తులైన కన్నబాబును మండల, నియోజవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు కన్నబాబు నివాసానికి తరలి వచ్చి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలాగే అభిమానులు కార్యకర్తలతో కలిసి కన్నబాబు పెదశంకర్లపూడి తరలివెళ్లి ఎమ్మెల్యే సత్యప్రభకు కృత జ్ఞతలు తెలిపి గజమాలతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో పల్లా గోపి, ఏ వెంకట్రావు, గొంతిన సురేష్, రోమాల అప్పలరాజు, పోలిశెట్టి శ్రీనివాస్, రాపూరి తాతాజీ, కుర్రం దాసు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకబోయిన మహిళను కాపాడిన స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్

విశాలాంధ్ర - అమలాపురం : ఎదుర్లంక-యానాం జీఎంసి బాలయోగి వారదిపై నుండి గోదావరిలోకి దూక బోయిన యానాం గోపాల్ నగర్‌కు చెందిన ఓ మహిళను గమనించి ఆ సమయంలో మోటార్ సైకిల్ పై అటుగా వెళ్తున్న స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ నాగరాజు. మహిళ చెయ్యి దొరకడంతో పట్టుకోగా, అటుగా వెళు్తన్న మరో నలుగురు సాయంతో ఆ మహిళలను రక్షించాడు. భార్య, భర్తల వివాదమే మహిళ ఆత్మహత్యకు కారణంగా గుర్తించి, కౌన్సిలింగ్ ఇచ్చి బందువులకు అప్పగించాడు. ప్రమాదంలో చిక్కుకున్న మహిళను కాపాడిన నాగరాజుకు పలువురు అభినందించారు.

పదవి విరమణ అనంతరం సమాజ సేవ చేయాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రతి ఒక్కరూ పదవి విరమణ అనంతరం తాము పని చేసిన సంస్థకు, సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని ఎంప్లా యిన్ యూని యన్ జిల్లా రీజినల్ కార్యదర్శి పి సత్యానందం పిలుపునిచ్చారు. ఈ మేరకు 37 సంవత్సరాలుగా ఏపీ ఎస్ఆర్టీసీ ఏలేశ్వరం డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ చేప ట్టిన నాగులపల్లి వెంకటరావు (ఎన్‌వి రావు) సన్మాన సభకు రీజనల్ కార్యదర్శి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరికి ఏదో ఒక రోజు పదవి విరమణ తప్పదని అన్నారు. తదనం తరం తాము పని చేసిన సంస్థకు, సమాజానికి తమ సూచనలు సలహాలను అందించాలని కోరారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యుబిఎం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమంలో కుమార్ మాట్లా డుతూ ప్రతి ఒక్క కండక్టర్ ఎన్‌వి రావును ఆదర్శంగా తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జివి సత్యనారాయణ, డిపో డిఎం ఆఫీస్ ఇంచార్జ్ జివి రామారావు, ట్రాఫిక్ ఇంచార్జ్ కె రుక్మిణి దేవి, ఏలేశ్వరం డిపో ఎన్ఎమ్‌యు కార్యదర్శి కె త్రిమూర్తులు, యునైటెడ్ వర్కర్స్ నాయకులు ఎన్‌పి రావు, కె మాణిక్యం, ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షులు బివిన్ బాబు, ఎల్‌విఎస్ నారాయణ ఎడిసి, జివిస్ నారాయణ ఎడిసి, యూనియన్ నాయకులు బివి రావు, ఎంఆర్ క్రిష్ణ, అనురాధ, జక్కా శ్రీను, ఎల్ఎన్ రావు, గంగారావు, వీరవరం శ్రీను మరియు యూనియన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

అంతా నాయిష్టం..!

- గురుకులంలో పెత్తనమంతా ఆమెదే
- పతకాలు సాధించిన విద్యార్థినుల పట్ల వివక్ష

విశాలాంధ్ర - అమలాపురం : మండలంలోని రానేలం కలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలు ఆందోళన బాట పట్టనున్నారు. పాఠశాలలోని ఒక వ్యాయామ ఉపాధ్యాయురాలు 'అంతా నాయిష్టం' అనే తరహాలో వ్యవహరిస్తుండటంతో వ్యాయామ ఉపాధ్యాయురాలు పై జిల్లా కలె క్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. స్థానిక రాజకీయ నాయకుల అండతో పాఠశాలలో ఆమె చక్రం తిప్పడంతోపాటు క్రీడా పోటీలలో పతకాలు సాధించిన వారిపై వివక్ష చూపుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్య యురాలికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే జరుగుతోంది. గురుకులంలో అన్ని తానేనంటూ ప్రిన్సిపాల్‌నుసైతం లెక్క చేయకుండా రాజకీయ నాయకుల అండతో తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణం. గతేడాది జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో 16 మంది విద్యార్థినులు పతకాలు సాధించగా, వారిని కాదని తన కుమార్తెను స్థానిక ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్లి ఆశీస్సులు తీసుకోవడం అప్పట్లో చర్చనీయం అయింది. ఆమె మెమెంటోలను పాఠశాల ఆవరణలో అధికార పార్టీ కార్యకర్త తో ఫోటోలు తీయించిన ఘటన పత్రికల్లో రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులానికి క్రీడా మైదానం లేకున్నా.. రాజకీయ పలుకుబడితో ఇద్దరు పీఈటీలు ఎందుకంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వారిలో ఒక పీఈటీ పాఠశాలకు వచ్చే విద్యార్థినులు, తల్లిదండ్రులపై అసహనం వ్యక్తం చేయడంతో పాటు వారిని దూషించిన ఘటనలు కోకొల్లలు. కొంతమంది విద్యార్థినుల విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విద్యార్థినులు తల్లిదండ్రుల వద్ద మొరపెట్టు కుంటున్నారు. వ్యాయామ ఉపాధ్యాయిని తీరు నచ్చక కొంతమంది తమ పిల్లలకు టీసీలు తీసుకుని వేరే పాఠశాలలో చేర్పించడం గమనార్హం. ప్రతిరోజు ఉదయాన్నే విద్యార్థినులను నిద్ర లేపి వ్యాయామం అనంతరం వారిని క్లాసుకు సిద్ధం చేయవలసిన పనిని కూడా సెక్యూరిటీ సిబ్బందికి అప్పగించినట్లు తెలిసింది. ఎవరైనా ఎదురు ప్రశ్నిస్తే సెక్యూరిటీ సిబ్బందిపై కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని స్థానిక నాయకుడొకరు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. పీఈటీపై తక్షణం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

సామాజిక విశ్లేషకులు డివివియస్ వర్మ

విశాలాంధ్ర - తణుకు : ప్రజాస్వామ్యానికి ప్రాణ ప్రదమైన ఎన్నికల వ్యవస్థకు కీలకమైన ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తూ "ఓటుచోరీ" కి పాల్పడడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదని స్థానిక సురాజ్య భవనం లో ఈ అంశం పై జరిగిన చర్చా గోష్టికి అధ్యక్షత వహించిన సామాజిక విశ్లేషకులు డివివియస్ వర్మ అన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా 65 లక్షల మందిని తొలగించి ఓట్ల చోరీకి పాల్పడిందని,, సవరించిన జాబితాలో ఇంటి నంబర్లు , తల్లిదండ్రుల పేర్లు లేనివారు, చిన్న చిన్న నివాసాల్లో వందల సంఖ్యలో అనర్హమైన వారిని ఓటర్లు గా చేసిందని, తొలగించిన ఓట్ల నమోదును కష్టతరం చేసి పేదల, వలస కూలీల, మైనారిటీల ఓటు హక్కును తొలగించిందనీ ఆయన విమర్శించారు.

ప్రభుత్వం ఆటో కార్మికుల్ని ఆదుకోవాలి

- సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ కృష్ణ డిమాండు

విశాలాంధ్ర - పిఠాపురం : ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రీ శక్తి పథకం కింద ఫ్రీ బస్ అమలు చేయడంపై ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయారని పథకాలు ప్రవేశ పెట్టేముందు ఎవరికి నష్టం వాటిల్లకుండా పథకాలు ప్రవేశ పెట్టడం ప్రభుత్వం బాధ్యత అని ఆదివారం స్థానిక ఉప్పాడ సెంటర్లో రజాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పిఠాపురం ఆటో యూనియన్ సభ్యులు పాల్గొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ నాయకుడు సాకా రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఉదయం లేచి ఆటో నడుపుకుంటే గాని జీవనోపాధి సాగని ఆటో కార్మి కులకు ఫ్రీ బస్సును పెట్టి వాళ్ళ పొట్టలు కొట్టడం మంచి పద్ధతి కాదని, ఆర్టీసీ ఆదాయం ఇబ్బంది కలుగుతుందని డీజీలు వాడకాలు తగ్గు తాయని అదేవిధంగా ఆటో మెకానిక్‌లు కూడా ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని వెంటనే ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుని ఆటో కార్మికులకు నెలకి 20వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో కార్మికులు కలుపుకుని దశలవారి పోరాటం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పందిరి లావ రాజు, కంది ప్రసాద్, సన్నా బత్తుల లక్ష్మణ్, గోవింద్, బందిల మోహన్, అభిరామ్ పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారి సస్పెన్షన్

విశాలాంధ్ర - గోపాలపురం : మండలంలోని వేళ్ళ చిం తలగూడెం, గ్రామంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యం కారణంగా కొపాటి వెంకట స్వామి, మృతి చెందిన సంఘటనలో గ్రామ రెవెన్యూ అధికారి కాంతారావును సస్పెండ్ చేసినట్లు తహశీల్దార్ ఎం.వి సాయిప్రసాద్ ఒక ప్రక టన ద్వారా తెలిపారు. అదే గ్రామానికి చెందిన రేషన్ షాప్ నం. 35 వద్దకు రైస్ కార్డు కోసం వచ్చి ఎక్కువమంది కార్డుల కోసం క్యూ కట్టిన కారణంగా ఇంటికి వెళుతూ మరణిం చినట్లు ఫిర్యాదు అందిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించామని తహశీల్దార్ (ఎఫ్ ఏ సి)ఎమ్ వి సాయి ప్రసాద్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాల మేరకు, క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి, వాస్తవ విషయాన్ని పరిగణనలోనికి తీసుకుని వేళ్ళ చింతల గూడెంరేషన్ షాప్ నం.35 డీలర్ చికిల సీతా రామకృష్ణను స్మార్ట్ కార్డు పంపిణీలో నిర్లక్ష్యం వహించిన కారణంగా డీలర్ హోజరై ఆథరైజేషన్ ను రద్దు చేయాలని కూడా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి రేషన్ కార్డులు సమయానికి, సరిగ్గ ఇంటి వద్దనే పంపిణీ చేయాలని అధి కారులు సూచించారు. ఆ మేరకు విధుల్లో నిర్లక్ష్యం కారణంగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపినట్లు తహశీల్దార్ వివరించారు.

వికలాంగులకు యథావిధిగా పెన్షన్ల పంపిణీ : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లాలో మొత్తం 2,35,813 మందికి రూ.102 కోట్ల 80 లక్షలు సెప్టెంబర్ ఒకటవ తేదీన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. అందులో వివిధ కేటగిరి పరిధిలో 33,177 వికలాంగ పెన్షన్లు ఉన్నాయ న్నారు. వీరిలో 3,211 మందికి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు గుర్తించి, రీ-అసెస్మెంట్‌లో భాగంగా వీరికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఆయా కేటగిరీలో తాత్కాలిక సర్టిఫికెట్లు కలిగిన మెంటల్ రిటార్డే షన్, మెంటల్ ఇల్నెస్ మరియు లోకోమోటర్ కేటగిరికి చెందిన 640 మందికి నోటీసులు ఉపసంహరించామ న్నారు. వీరికి సెప్టెంబర్ 1వ తేదీన యథావిధిగా పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మన మిత్రా యాప్ ద్వారా పన్నులు వసూళ్ళ జిల్లాలో డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పంచాయతీ రాజ్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ప్రజలు సులభతరంగా పన్నులు చెల్లించేం దుకు స్వర్ణ పంచాయితీ వెబ్‌సైట్ (https://swarnapa nchayat. apcfss. in ను ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 299 గ్రామ పంచాయతీలలో మొత్తం 3,58,297 అసె స్మెంట్లు నమోదు చేయబడ్డాయి. వీటిలో ప్రతి అసెస్మెంట్ ఆధారం గా ప్రజలు ఇంటి పన్నులను డిజిటల్ రూపంలోనే చెల్లిం చవలసి ఉంటుంది. డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇకపై నగదు చెల్లింపులకన్నా డిజిటల్ చెల్లింపులకు ప్రాధా న్యం ఇవ్వాలని కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డు, చెక్ రూపంలో కూడా డిజిటల్ చెల్లింపులు చేయుటకు సౌకర్యం ఉంది. పన్నులు నేరుగా గ్రామ పంచాయతీ ట్రెజరీ ఖాతాలోనే జమ అవు తాయి. ప్రతి ఒక్కరూ "మన మిత్రా" యాప్ ఉపయోగిం చాలి. ప్రతి పౌరుడు స్వర్ణ పంచాయితీ వెబ్‌సైట్ లేదా మన మిత్రా యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటి అసెస్మెంట్ నెంబర్ తప్పనిసరిగా మ్యాప్ (మీజూ) అయ్యి ఉండాలి. "జిల్లా ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి" డిజిటల్ చెల్లింపులు సమయం ఆదా, పారదర్శకత పెరుగుతుంది. అవినీతి అవకాశాలు తగ్గి, నేరుగా పంచాయితీ ఖాతాలోనే నగదు మొత్తాలు జమవుతాయి. ప్రజలకు అవగాహన కల్పించడానికి పంచాయతీ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడు తున్నామని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మన మిత్రా యాప్ వినియోగించి గ్రామాల పంచాయతీల ఆర్థిక పరిపుష్టి లో భాగస్వామ్యం అవ్వాలని తెలిపారు.

సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడ జయప్రదం చేయండి

ఐకాసా చైర్మన్ పిలుపు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జరప తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు, ఐకాస నాయకులు ఆర్ఎస్. హరనాథ్ పిలు పునిచ్చారు. 2004వ సంవత్సరంలో సెప్టెంబర్ 1న ఆనాటి యూపీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక నేషనల్ పెన్షన్ స్కీంని తీసుకొచ్చి కేంద్రంలో, రాష్ట్రంలో పింఛన్ అమలు కాకుండా చట్టం చేసిందని చెప్పారు. 2004 తర్వాత ప్రభుత్వ నియామకాలలో ఉద్యో గం పొందిన ప్రతి ఉద్యోగి ఈ నేషనల్ పెన్షన్ స్కీం పరిధి, లోకి వస్తారని పిఎఫ్ఆర్డిఏ చట్టాన్ని తీసుకొచ్చి ఉద్యోగులకి సంబంధించి భవిష్యత్‌లో పెన్షన్ లేకుండా చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా ఉద్యోగి వాటా క్రింద 10 శాతం జీతం లో మినహాయించి ప్రభుత్వ వాటా క్రింద 10 శాతాన్ని ఎన్ఎస్డిఎల్ ద్వారా సెక్యూరిటీలుగా షేర్ మార్కెట్‌లో పెట్టి సదరు ఉద్యోగి పదవి విరమణ పొందిన తరువాత పెద్ద మొత్తంలో ఉద్యోగికి సొమ్ము ఇస్తామని ఆ చట్టంలో పొందు పరిచారని వివరించారు. ఈ విధానం వద్దని చెప్తూ అటు కేంద్ర ఉద్యోగులు, రాష్ట్ర ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా ఉద్యమాన్ని చేస్తూ పాత పింఛను విధానం అమలు చేయాలని ఢిల్లీ స్థాయిలో, రాష్ట్ర రాజ ధాని స్థాయిలో ఉద్యమాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల ఆందోళనలు పట్టించు కోకుండా సీపీఎస్‌ని మార్చి జీపిఎస్‌అని యూపిఎస్‌అని నామకరణం చేసి అదే సీపీఎస్‌ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం సీపీఎస్‌ని ఎన్నికల వాగ్దానాలుగా మిగిల్చిందని విమర్శిం చారు. అదే విధంగా 2004 కి ముందు ఉద్యోగం పొందిన గ్రూపు-1,2 అధికారులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర క్యాడర్ లో ఉద్యోగాలు పొందిన వారికి కూడా నూతన పెన్షన్ విధానము సీపీఎస్ ని అమలు చేస్తు న్నారన్నారు. అయితే అటువంటి వారికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం మెమో 57 ద్వారా పాత పెన్షన్ కొనసాగి స్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ విధానాన్ని సుమారు 16 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని, అందువల్ల ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ మెమో ప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

పుట్టపర్తి సాయిబాబా శత జయంతి ప్రభుత్వం జరపడం సిగ్గుచేటు

విశాలాంధ్ర -భీమవరం: పుట్టపర్తి సత్య సాయి బాబా శత జయంతిని పండుగగా జరపాలని ప్రభు త్వం ఇచ్చిన జిఓ 862 ను రద్దు చేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో ఎందుకు పనికిరాని వారు బాబాల వేషాలు వేసుకొని , ప్రజల అమాయకత్వాన్ని అజ్ఞానాన్ని ఆసరాచేసుకొని వేల కోట్లరూపాయలు, వందలాది ఎకరాలు భూములు సంపాదిస్తున్నారని అలాంటివారిలో పుట్టపర్తి సాయిబాబా ఒకరని ఆరోపించారు. నాడు ఎన్టీఆర్ తన సొంత సినిమా "కోడలుదిద్దిన కాపురం"లో ఒక పాట ద్వారా పుట్టపర్తి బాబాను, ఆయన మోసాలను ఉతికిఆరేశారని, అలాంటి సాయిబాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించడం ఎన్టీఆర్‌ను అవమానపరచటడం కాదాని ఆయన ప్రశ్నించారు. 1954 చట్టం ద్వారా అప్పట్లోనే అరెస్టు చెయ్యాలని, ఎన్నో మోసాలుచేసిన సాయబాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలనడం రాజ్యాంగ విరుద్ధమని, లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయిబాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలనే ప్రభుత్వ జివో నంబరు 862 ను రద్దు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. హేతువాద సంఘ సభ్యులు గోఖలే, వి.వి.ప్రసాద్, ,క్రాంతికుమార్, సత్యనారయణ, ఖాన్ బాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేలల్లో కరెంట్ బిల్లు, లబో..దిబోమంటున్న బాధితురాలు

విశాలాంధ్ర - లింగపాలెం : ఒంటరి, పేదింటి మహిళకు రూ57,096లు కరెంట్ బిల్లు రావటంతో లబో, దిబో మంటుంది. కొత్తపల్లికి చెందిన డి.చిట్టెమ్మకు ఇంటి బిల్లు వేల రూపాయల్లో వచ్చింది. భర్తలేని ఈమె ఇంటిలో రెండు బల్బులు, ఒక ఫ్యాను పనిచేస్తుంటుంది. ఎప్పుడూ రూ. 150లు మించి ఇంటి బిల్లు రాని ఈమెకు వేలల్లో రావటంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంది. ఈమె మీటర్ నెంబరు 1516834012000619 వేలల్లో బిల్లు వచ్చిన విద్యుత్తు శాఖధి కారులే న్యాయం చేయాలని కోరుతుంది. లింగపాలెం మండలంలో అనేక మందికి నెలవారి విద్యుత్ బిల్లులు వేలల్లో వస్తూనే ఉన్నాయని వాపోతున్నారు. వీరంతా విద్యుత్తు కార్యాలయాలు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తక్కువ వినియోగంవున్న అధిక బిల్లులు రావడం వినియోగ దారులకు సమస్యగా ఉంది. అధిక బిల్లులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతి ఒక్కరు కోరుతున్నారు.

గోదావరి జిల్లాల్లో పోలీసులకు సవాల్

జోరుగా గణేష్ నిమజ్జనాలు... భారీ వరదలు
బందోబస్తు, భద్రతా చర్యలలో తలమునకలు

విశాలాంధ్ర - కొవ్వూరు : విఘ్నాలు తొలగించే వినాయక చవితి వేడుకలు ఒక వైపున పెద్ద ఎత్తున జరుగుతుండగా, మరోవైపు భారీ వర్షాలకు గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో అటు వేడుకలకు, ఇటు బందోబస్తు విధులు నిర్వర్తించడం పోలీసులకు కత్తిమీద సాములా తయారైంది. గోదావరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో అటు గణేష్ మండపాల నిర్వాహకులు, ఇటు దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మండపాల వద్ద విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండపాల డెకరేషన్, మైక్ సెట్‌లకు సంబంధించి ప్రభుత్వ ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. మండపాల వద్ద ప్రత్యేకంగా మీటర్లను ఏర్పాటు చేసి రీడింగ్ నమోదు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కుర్రకారు జోరు కొనసాగుతుండగా, మరోవైపు గోదావరి వరదలతో ప్రజలకు భద్రత కల్పించడంతోపాటు శాంతి భద్రతల పరిరక్షణ, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు, వరదల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వినాయక నిమజ్జన కార్యక్రమాలలో అభ్యంతకర కార్యక్రమాలు లేకుండా చూడటంతోపాటు ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయడంపైనే పోలీసులు దృష్టి సారించారు. మరోవైపు అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో గోదావరికి వరద పోటెత్తుతోంది. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండిపోగా, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కొవ్వూరు, రాజమండ్రి పట్టణాలతో పాటు నిడదవోలు ప్రాంతంలో కూడా కొన్ని పాయిలు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొవ్వూరులోని గోష్పాద క్షేత్రంతోపాటు దానికి అనుబంధంగా ఉన్న ఐదు రేవులకు పెద్ద ఎత్తున గణనాధులు నిమజ్జనానికి తరలివస్తున్నారు. దీంతో గోదావరి ఘాట్‌లు, రేవుల వద్ద అటు నిమజ్జనాలు, ఇటు వరద ఉధృతి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు రేయింబవళ్లు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు.